S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 09 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 9 అక్టోబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131




## ముంబైలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం

అత్యాధునిక ఎయిర్ పోర్టుకు ప్రధాని ప్రారంభం

రూ.19,650 కోట్లతో అదానీ ఎయిర్‌పోర్ట్స్, సిడ్కో నిర్మాణం

అత్యాధునిక నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ఫేజ్-1 అందుబాటులోకి వచ్చింది. దీనిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారంనాడిక్కడ ప్రారంభించారు. అదానీ ఎయిర్‌పోర్ట్స్, సిడ్కో మధ్య పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో రూ.19,650 కోట్లతో దీనిని నిర్మించారు. 3

## జాతీయ భద్రతలో రాజీపడ్డ కాంగ్రెస్

- ముంబై దాడులకు ఎందుకు ప్రతీకారం తీర్చుకోలేదు
- ప్రతీకారం తీర్చుకోకుండా అడ్డుకున్నదెవరు
- తమకు జాతీయ భద్రతే ముఖ్యమన్న ప్రధాని మోడీ



తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై దాఖలైన పిటిషన్లన్నింటినీ కలిపి విచారించాలని హైకోర్టు నిర్ణయించింది. ఈ అంశంపై దాఖలైన పలు పిటిషన్లను ఈ రోజు విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, సమర్థిస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను ఒకేసారి విచారిస్తామని పేర్కొంది.




# విచారణ వాయిదా

## పిటిషన్లన్నీ కలిపి విచారణ

■ బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు కీలక నిర్ణయం

- స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ కోటాపై విచారణ
- విచారణ తిరిగి నేటికి వాయిదా వేసిన కోర్టు
- 50 శాతం పరిమితిని మించి రిజర్వేషన్లు ఉన్నాయంటూ పిటిషనర్ల వాదన
- ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ
- ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా ఇంప్లీడ్ పిటిషన్లు
- స్థానిక ఎన్నికల షెడ్యూల్‌పై ప్రభావం చూపే అవకాశం

**హైదరాబాద్, అక్టోబర్8:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ-9ను సవాల్ చేస్తూ బి. మాధవరెడ్డి, ఎస్. రమేశ్ మరికొందరు గతంలోనే హైకోర్టును ఆశ్రయించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు ఉండగా, బీసీ కోటాను 25 శాతం నుంచి 42 శాతానికి పెంచడంతో మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చేరాయని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇది సుప్రీంకోర్టు ఇంద్రా సహానీ కేసులో నిర్దేశించిన 50 శాతం పరిమితిని ఉల్లంఘించడమేనని వారు వాదించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరపున కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. బీసీ కోటా పెంపు కోసం పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285-ఏను సవరించామని అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం

మిగతా 2 లో

## పెట్టుబడుల ఆకర్షణలో సరికొత్త అధ్యాయం

### దేశ చరిత్రలో ఏపీకి అతిపెద్ద పెట్టుబడి

- రూ.87,520 కోట్లతో విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్
- 1,14,824 కోట్ల పెట్టుబడులకు 11వ ఎస్ఐపీబీ ఆమోదం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రాజెక్టులకు పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం



**అమరావతి:** పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్ర ప్రదేశ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆకర్షించింది. అమెరికా వెలుపల అతి పెద్ద డేటా సెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. 87,520 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ డేటా సెంటర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన 11వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని మిగతా 2 లో

## అమరావతితో పాటు స్థానిక రైతులూ అభివృద్ధి చెందాలి 5



## స్థానిక ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

"తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గురువారం యథావిధిగా నోటిఫికేషన్ విడుదల కానుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉదయం 10.30 గంటలకు నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది."

- హైకోర్టులో విచారణ ఉన్నప్పటికి ప్రక్రియ మొదలు
- అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డితో మంత్రుల మంతనాలు

02

## జగన్ పర్యటనకు ఇన్ని ఆంక్షలా

18 కండిషన్లు పెట్టారన్న మాజీమంత్రి అమర్‌నాథ్ 2





# ఐ యామ్ సారీ

- అడ్లూరికి పొన్నం వ్యక్తిగత క్షమాపణ
- పీసీసీ చీఫ్ నివాసంలో మంత్రుల భేటీ
- కలిసి పని చేయాలని మహేష్‌గౌడ్‌సూచన
- కాంగ్రెస్‌లో సమసిన పంచాయితీ

2

## ఎన్డీఎంఏ సేవలు భేష్

కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్



3

## 2 దగ్గు మందులపై ప్రభుత్వం నిషేధం

ఉత్తర్వులు జారీ సర్కారు 2





# బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

- మంటల్లో ఆరుగురు దుర్మరణం
- పలువురికి గాయాలు..ఆస్పత్రికి తరలింపు
- ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- తక్షణ సహాయక చర్యలకు ఆదేశం

కోనసీమ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రాయవరంలోని గణపతి గ్రాండ్ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అనపర్తి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారిని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. పేలుడు

మిగతా 3 లో

# దగ్గు మందులపై నిషేధం

## ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం





**హైదరాబాద్, అక్టోబర్ 8:** రెండు దగ్గు మందులను నిషేధిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రీలైఫ్, రెస్పీఫ్రెష్-టీఆర్‌ను విక్రయించొద్దంటూ అందులో పేర్కొంది. ఈ రెండు దగ్గు మందుల్లోనూ కల్తీ జరిగినట్లు గుర్తించారు. వీటిని గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీల ఔషధాలుగా పేర్కొన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' అనే దగ్గు మందు వాడడం వల్ల పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే 'కోల్డ్ రిఫ్'ను పూర్తిగా నిషేధిస్తున్నట్టు ఔషధ నియంత్రణ విభాగం డీసీఏ ప్రకటించింది. చిన్నారులలో తీవ్రమైన రోగాల్ని, మరణాలను కలిగిస్తున్న ప్రమాదకర దగ్గు మందులను రాష్ట్ర ప్రభుత్వం నిషేధిస్తూ చర్య తీసుకుంది. రీలైఫ్, రెస్పీఫ్రెష్-టీఆర్ అనే రెండు సిరప్‌లను విక్రయించరాదు అని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం పిల్లల భద్రతను ముఖ్యంగా పరిగణించి తీసుకోవడం విశేషం. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కోల్డ్‌రిఫ్ సిరప్ కారణంగా 16 చిన్నారుల మరణాలు చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా ఎడపెడా పిల్లలకు దగ్గు, జలుబు సిరప్‌లు ఇవ్వకూడదని అధికారిక సూచనలు కూడా జారీ అయ్యాయి. కాంచీపురంలో తయారు చేసిన కోల్డ్‌రిఫ్ సిరప్‌పై ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తనిఖీలు నిర్వహించింది. ఈ సిరప్‌ను తక్షణం తెలంగాణలో విక్రయించరాదని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని హాస్పిటళ్లు, ఫార్మసీలు ఈ నిషేధాన్ని వెంటనే అమలు చేయాల్సినట్లు సూచించబడింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హామీ

## దీపావళి వరకు బంద్ వాయిదా వేసిన విద్యాసంస్థలు

హైదరాబాద్, అక్టోబర్ 8: ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రభుత్వం ఇచ్చిన హామీతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసుకుంది. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని సమాఖ్య ప్రతినిధులు కలసి తమ సమస్యలను వివరించారు. అనంతరం వారు సమావేశమై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వం దీపావళి లోపల రూ.300 కోట్ల బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో అక్టోబర్ 13వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన సమ్మెను, కళాశాలల బంద్ కార్యక్రమాన్ని అక్టోబర్ 23వ తేదీ వరకు (దీపావళి మరుసటి రోజు వరకు) వాయిదా వేయాలని నిర్ణయించారు. అయితే, దీపావళి నాటికి బకాయిలు విడుదల కాకపోతే.. అక్టోబర్ 23న మళ్లీ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటా మని సమాఖ్య స్పష్టం చేసింది. ఇక, దసరా ముందు విడుదల చేసిన రూ.200 కోట్ల బకాయిల్లో సుమారు 70 మైనారిటీ, జనరల్ కళాశాలలకు ఒక్క రూపాయి కూడా అందలేదని సమాఖ్య పేర్కొంది. ప్రభుత్వం వెంటనే నిధుల విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



**న్యూఢిల్లీ,అక్టోబర్ 8:** రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు 2025కు గాను నోబెల్ బహుమతి లభించింది. మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధి చేసినందుకు సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎమ్ యాఘీలకు నోబెల్ బహుమతిని అందించనున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తెలిపింది. వీరు కొత్త రకం మాలిక్యూలర్ ఆర్కిటెక్చర్ అభివృద్ధి చేసినట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. గతేడాది కూడా రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి లభించింది. ప్రొటీన్లపై విశేష పరిశోధనలు చేసిన డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్ ఈ పురస్కారం అందుకున్నారు. కాగా, ఈ ఏడాది ఇప్పటికే వైద్య శాస్త్రంలో బ్రంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్, డాక్టర్ షికోమ్ సకాగుచీకి నోబెల్ బహుమతి ఎంపికయ్యారు. అలానే భౌతికశాస్త్రంలో జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టినిస్, మైఖేల్ హెచ్ డెవొరెట్‌ను నోబెల్ కమిటీ ప్రకటించింది. గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతి, అక్టోబర్ 13న అర్థశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను ప్రకటిస్తారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న విజేతలకు అవార్డులను అందజేస్తారు.

# 12న పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

**హైదరాబాద్, అక్టోబర్ 8:** ఈ నెల 12వ తేదీన రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. మన రాష్ట్రంలో పోలియో చివరి కేసు 2007లో నమోదు అయింది. మన దేశంలో 2011లో చివరి కేసు నమోదు అయింది. గత 3 సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదు అవుతున్నాయని కేంద్ర వైద్యారోగ్య శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో.. ఆయా దేశాల నుంచి రాకపోకలు జరుగుతున్న దేశంలోని పలు జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి 5 జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ ఉన్నాయి. ఈ ఐదు జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఈ 5 జిల్లాల పరిధిలో 0-5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్‌లో పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల దగ్గర్నుంచి, 5 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# నాటుబాంబు పేలి రైతుకు గాయాలు

**ములుగు, అక్టోబర్ 8:** ములుగు జిల్లాలోని జగ్గన్నపేట గ్రామ సమీపంలో ఘోరం జరిగింది. ఓ రైతు తన పొలంలో గడ్డి మందు పిచికారీ చేస్తుండగా, ఒక్కసారిగా నాటుబాంబు పేలింది. దీంతో రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. రైతు కాలు నుజ్జునుజ్జు అయింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు బాధిత రైతును హుటాహుటిన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బాధిత రైతు మదనపల్లి గ్రామానికి చెందిన కుంటమల్ల సాంబయ్యగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# స్థానిక ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

- హైకోర్టులో విచారణ ఉన్నప్పటికి ప్రక్రియ మొదలు
- అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డితో మంత్రుల మంతనాలు




**హైదరాబాద్, అక్టోబర్8:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ-9ను సవాల్ చేస్తూ బి. మాధవరెడ్డి, ఎస్. రమేశ్ మరికొందరు గతంలోనే హైకోర్టును ఆశ్రయించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు ఉండగా, బీసీ కోటాను 25 శాతం నుంచి 42 శాతానికి పెంచడంతో మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చేరాయని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇది సుప్రీంకోర్టు ఇంద్రా సహానీ కేసులో నిర్దేశించిన 50 శాతం పరిమితిని ఉల్లంఘించడమేనని వారు వాదించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. బీసీ కోటా పెంపు కోసం పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285-ఏను సవరించామని అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం ఇంకా లభించలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. ఇదే అంశంపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టులోనే తేల్చుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ వివాదం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ నేతలు వి. హనుమంతరావు, చరణ్ కౌశిక్, ఇందిరా శోభన్ సహా పలువురు నేతలు ఈ కేసులో ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. కాగా, అక్టోబర్-నవంబర్ నెలల్లో ఐదు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఈ విచారణ ఫలితం ఆ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

## విచారణ వాయిదా

మొదటి పేజీ తరువాయి

ఇంకా లభించలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. ఇదే అంశంపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టులోనే తేల్చుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. ఈ వివాదం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ నేతలు వి. హనుమంతరావు, చరణ్ కౌశిక్, ఇందిరా శోభన్ సహా పలువురు నేతలు ఈ కేసులో ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. కాగా, అక్టోబర్-నవంబర్ నెలల్లో ఐదు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఈ విచారణ ఫలితం ఆ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఐ యామ్ సారీ



**హైదరాబాద్, అక్టోబర్ 8:** తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల ఏర్పడిన అంతర్గత విభేదాలు సర్దుబాటు అయ్యాయి. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య చెలరేగిన వివాదానికి తెరపడింది. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చొరవ తీసుకుని ఇరు నేతలకు సర్దిచెప్పడంతో సమస్య పరిష్కారమైంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ భేషరతుగా క్షమాపణ తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నివాసంలో ఈ మంత్రులిద్దరూ భేటీ అయ్యారు. టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ నివాసంలో ఇరువురు మంత్రుల మధ్య సయోధ్య కుదిరింది. బుధవారం ఉదయం పీసీసీ చీఫ్ నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో అడ్లూరికి పొన్నం క్షమాపణలు చెప్పారు. దీంతో ఇరువురి మధ్య వివాదం ముగిసింది. దీనిపై పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చేశారన్న వ్యాఖ్యల పట్ల మరో మంత్రి లక్ష్మణ్ నొచ్చుకోవడంతో యావత్ సమాజం కొంత బాధపడిందన్నారు. మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్యగా వెల్లడించారు. జరిగిన సంఘటన పట్ల చింతిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కష్టపడి పైకొచ్చిన నేతలని తెలిపారు. ఈ సమస్య ఇంతటితో సమసిపోవాలని యావత్ మాదిగ సామాజిక వర్గానికి పీసీసీ చీఫ్ విజ్ఞప్తి చేశారు. ఎక్కడ మాట్లాడినా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సహచర మంత్రివర్గానికి కూడా విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహాయంతో కుల సర్వే పారదర్శకంగా నిర్వహించామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మూడు చట్టాలు తీసుకొచ్చామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. పొన్నం క్షమాపణ కోరడంతో ఈ సమస్య ఇంతటితో సమసిపోయిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. పొన్నం ప్రభాకర్‌ను గౌరవిస్తా.. కానీ ఆయన వాఖ్యల పట్ల మాదిగ జాతి బాధపడింద న్నారు. అట్టడుగు సామాజిక వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు. జెండా మోసిన తనకు మంత్రిగా అవకాశం ఇచ్చారని... పార్టీ లైన్ దాటే వ్యక్తిని కానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నేను ఆ మాట అనకపోయినా క్షమాపణలు చెబుతున్నా. పత్రికా కథనాలతో మంత్రి అడ్లూరి మనస్తాపం చెందారు. అందుకే ఆయనకు క్షమాపణలు చెబుతున్నా. మంత్రి అడ్లూరికి, నాకు పార్టీ సంక్షేమం తప్ప మరో ఉద్దేశం లేదు. కాంగ్రెస్ నేతలమంతా సామాజిక న్యాయం కోసం పని చేస్తాం అని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఓ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నట్లుగా వ్యాఖ్యలు సోషల్‌మీడియా లో రావడం.. వాటిపై లక్ష్మణ్‌కుమార్ ఓ వీడియో విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. తనపై పొన్నం అనుచిత వ్యాఖ్యలు చేశారని, మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలని అందులో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరు మంత్రుల మధ్య ఉన్న విభేదాలు.. ఇప్పుడు బహిర్గతమయ్యాయన్న చర్చ జరిగింది. తాజాగా బుధవారం మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్య నేతల చొరవతో పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య వివాదం ముగిసింది. దీంతో పార్టీలో ఐక్యతను రక్షించేందుకు సంకేతం ఇచ్చారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అడ్లూరి లక్ష్మణ్ ఇబ్బంది పడ్డారు. అందుకే భేషరతుగా క్షమాపణ చెప్పడం జరిగింది. అన్ని విషయాలు కుటుంబ సంబంధ సమస్యలుగా మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు ఈ సమస్యను ఇంతటితో ముగించాలనే కోరుతున్నాను అని స్పష్టం చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అండగా ఉంటుంది. ప్రతి కార్యకర్త, నాయకుడు ఐక్యంగా పని చేయాలని కోరుకుంటున్నాం అని చెప్పారు.



# జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసన

## ప్లకార్డులతో నిరసన తెలిపిన ఉద్యోగులు

**హైదరాబాద్, అక్టోబర్ 8:** భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్. గవాయిపై జరిగిన దాడికి నిరసనగా తెలంగాణ సచివాలయంలో ఆగ్రహావేశం వ్యక్తమైంది. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని జస్టిస్ గవాయి జిందాబాద్', దళితులపై దాడులు ఆపాలి, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేశారు. సిజెఐ బిఆర్ గవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం, చట్ట వ్యవస్థ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ.. బిఆర్. గవాయి దేశ అత్యున్నత న్యాయస్థానానికి చెందిన రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తి. ఆయనపై దాడి జరగడం అంటే న్యాయవ్యవస్థ, సామాజిక సమానత్వం మీద దాడి చేసినట్లే. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద మచ్చ అని పేర్కొన్నారు. నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు బి.ఆర్. గవాయికి సంఘీభావం వ్యక్తం చేస్తూ, ఆయనకు పూర్తి భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# పాక్‌పై దాడిని అడ్డుకున్నదెవరు?

## ముంబై దాడులకు ఎందుకు ప్రతీకారం తీర్చుకోలేదు

## మాకు జాతీయ భద్రతే ముఖ్యం

## ప్రధాని నరేంద్ర మోదీ

**ముంబై, అక్టోబర్ 8:** 2008 ముంబై ఉగ్రవాద దాడుల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన 'బలహీనత'ను ప్రదర్శించిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ఈ రోజు ప్రధాని నరేంద్రమోడీ బుధవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ హయాంలోని యూపీఏ పాలనపై విమర్శలు గుప్పించారు. అప్పటి రాజకీయ నిర్ణయాలు మరో దేశం నుంచి వచ్చిన ఒత్తిడి ద్వారా ప్రభావితమయ్యాయని ఆరోపించారు. ముంబై దేశంలోని అత్యంత శక్తివంతమైన నగరాల్లో ఒకటి అని, అందుకే ఉగ్రవాదులు 26/11 దాడులకు తెగబడ్డారని అన్నారు. ఇటీవల, కాంగ్రెస్ మాజీ హోం మంత్రి పి. చిదంబరం ముంబై ఉగ్రదాడుల గురించి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ఒత్తిడి వల్ల తాము పాకిస్తాన్‌పై దాడి చేయలేదని చెప్పారు. ముంబై దాడుల తర్వాత మన భద్రతా దళాలు పాకిస్తాన్‌పై దాడి చేయడానికి సిద్ధమయ్యాయని, కానీ వేరే దేశం ఒత్తిడి కారణంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భద్రతా బలగాలను ఆపిందని చిదంబరం అన్నారు. దీనిపై ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఏ దేశం ఒత్తిడి తెచ్చిందో వెల్లడించాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం కారణంగా భారత్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ బలహీనత ఉగ్రవాదుల్ని బలపరిచిందని, ప్రాణాలను త్యాగం చేయడం ద్వారా దేశం పదేపదే ఉగ్రవాదానికి మూల్యం చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. ఉగ్రదాడి అనంతరం సైనిక చర్యను అడ్డుకుంటూ ఆనాడు నిర్ణయం తీసుకున్నదెవరో చెప్పాలని కాంగ్రెస్‌ను నిలదీశారు. దేశంలో అత్యంత శక్తివంతమైన నగరాల్లో ముంబై ఒకటి కావడంతోనే ఉగ్రవాదులు దానిపై దాడి చేశారన్నారు. నాటి నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలని, దేశ ప్రజలకు ఈ విషయం తెలియాలని అన్నారు. కాంగ్రెస్ చూపించిన బలహీనతే ఉగ్రవాదులకు బలంగా మారిందన్నారు. జాతీయ భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వానికి దేశం,




దేశ పౌరుల భద్రతే అత్యంత ముఖ్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టామని గుర్తు చేశారు. ఉగ్రవాదంపై తమ ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటుందనడానికి ఇదే ఉదాహరణ అని చెప్పారు.మన దేశ భద్రత, పౌరుల భద్రత కన్నా మరేది ముఖ్యం కాదని మోడీ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ప్రస్తావిస్తూ, నేటి భారతదేశం తన శత్రువులను వారి ఇళ్లలోకే వెళ్లి హతమారుస్తోందని ప్రధాని అన్నారు. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ 'వికసిత్ భారత్'ను ప్రతిబింబించే ప్రాజెక్ట్ అని ప్రధాని అన్నారు. కొత్త విమానాశ్రయం ద్వారా మహారాష్ట్రలోని రైతుల ఉత్పత్తులు మిడిల్ ఈస్ట్, యూరప్ మార్కెట్లతో అనుసంధానించబడుతాయని చెప్పారు.

# గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటాం

- ఏ ఒక్కరికీ అన్యాయం జరగరాదు
- 2లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చండి
- గన్‌పార్క్ వద్ద విద్యార్థులకు మద్దతుగా కవిత దీక్ష




**హైదరాబాద్, అక్టోబర్ 8:** గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. గన్ పార్కు అమరవీరుల స్తూపం వద్ద గ్రూప్-1 అభ్యర్థులు చేపట్టిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రిలిమ్స్ పరీక్షల నుంచే అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేరు కోసం బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దని చెప్పారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం కష్టపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. పారదర్శకంగా పరీక్షలు పెట్టండి. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక పాత ఉద్యోగాలే ఇచ్చారు. ఇవి తప్పుడు పరీక్షలు. కాంగ్రెస్ కోసం వారిని ఎంపిక చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడాలి. మిమ్మల్ని విద్యార్థులు నమ్మారు.. వారి పక్షాన నిలబడండి. మూల్యాంకనం సరిగా జరగాలి. కోర్టుల్లో జడ్జీలకు అర్థం అయ్యేదాకా పోరాటం చేస్తాం. గ్రూప్-1 నియామకాలను రద్దు చేసి.. మళ్లీ పరీక్ష నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బుధవారం నిరసనకు దిగారు. నిరుద్యోగులకు మద్దతుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. విద్యార్థుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కొంత మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి గ్రూప్ 1 పెట్టారా అని ప్రశ్నించారు. తెలిసో తెలియకనో గత పదేళ్లలో గ్రూప్ 1 పెట్టలేదన్నారు. నిరుద్యోగులతో అధికారంలోకి వచ్చి వాళ్ళనే రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పరీక్ష రాసిన విద్యార్థులు.. ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు రాసిన పేపర్లు బయట పెట్టమని అడుగుతున్నారన్నారు. 50 వేల పాత ఉద్యోగాలు ఇచ్చి తాము ఇచ్చినం అని అంటున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ హరగోపాల్‌ను స్వయంగా కలుస్తామని.... వ్యవస్థ ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులలో నిరుద్యోగులను మోసం చేస్తే కుర్చీలో నుంచి తీసి బయట పడేస్తారని హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ మీటింగ్ ఉందన్నారు. ప్రజా ఆగ్రహానికి గురికావొద్దని ప్రభుత్వానికి సూచించారు. ఉద్యోగాలు వచ్చిన వారిపై తమకు కోపం లేదని.. అక్రమంగా తెచ్చుకున్న వారిపైనే కోపమని కవిత స్పష్టం చేశారు.

# ఎన్డీఎంఏ సేవలు భేష్

- ఎన్డీఆర్ఎఫ్ సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించండి
- ప్రతి ఒక్కరూ 'సచేత్' యాప్ డౌన్ లోడ్ చేసుకునేలా ప్రచారం చేయండి
- దిశ మీటింగ్ లోనూ ఎన్డీఆర్ఎఫ్ సేవల విభాగాన్ని భాగస్వాములు చేసే అంశాన్ని పరిశీలించండి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**ఢిల్లీ, అక్టోబర్ 8:** జాతీయ విపత్తుల నిర్వహణ సేవల్లో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అగ్రస్థానంలో ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. జాతీయ విపత్తుల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందిస్తున్న సేవలతోపాటు జాతీయ విపత్తుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేందుకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులను కోరారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'సచేత్ యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్ లోడ్ చేసుకునేలా చైతన్యం కలిగించాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ సిబ్బందికి క్లిష్టమైన సమయాల్లో రోప్స్, గ్యాస్ కట్టర్స్, జాకెట్ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని కోరారు. బుధవారం న్యూఢిల్లీలోని ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ) సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్డీఎంఏ ఉన్నతాధికారులతో సమావేశమై సంస్థ అందిస్తున్న సేవలను, చేపడుతున్న కార్యాచరణను అడిగి తెలుసుకున్నారు. ఎన్డీఎంఏ సేవలకు సంబంధించి కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ప్రధానంగా తెలంగాణ, పంజాబ్, ఢిల్లీ వరదల (2025)తోపాటు సిక్కిం వరదలు, వయనాడ్ ల్యాండ్‌స్లైడ్, హిమాచల్ వరదల సమయంలో, బాలాసోర్ రైల్వే ప్రమాదం (2023), సిల్క్యారా టన్నెల్ రక్షణ చర్యల్లో(2023) భాగంగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందించిన సాహసోపేత చర్యలను వివరించారు. యువ ఆపద మిత్ర స్కీం కింద ఎన్‌సీసీ, ఎన్‌వైకేఎస్, బీఎస్‌జీ, ఎన్ఎస్ఎస్ సంస్థల నుండి యువ వాలంటీర్లను చేర్చి, 28 రాష్ట్రాల్లో 2,37,326 వాలంటీర్లు మరియు 1,300 మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వబడిందిబీ ఈ సంస్థలతో కలిసి విపత్తు స్పందన సేవల్లో యువతను భాగస్వామ్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విపత్తు సేవలు అందించే విషయంలో జపాన్, రష్యా, జర్మనీ, మాల్దీవులు, చిలీసహా 14 దేశాలతో అంతర్జాతీయ అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. అత్యధిక వర్షాలు, వరదలు, విపత్తులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేందుకు 'సచేత్ యాప్ ను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13.9 లక్షల డౌన్ లోడ్స్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా ఎక్కడ ఏ విపత్తు వచ్చే అవకాశం ఉందనే సమాచారం ప్రజలకు తెలుస్తుందని, తద్వారా ఆ విపత్తు నుండి బయటపడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అద్భుతమైన సేవలు అందిసున్నప్పటికీ సరైన ప్రచారం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తుఫానులు, వరదలుసహా పెను ప్రమాదాలు ఏర్పడిన సమయంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సాహసోపేత సేవలు అందిస్తున్న విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా సచేత్ యాప్ ను దేశ పౌరులంతా డౌన్ లోడ్ చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రెస్క్యూ సిబ్బందికి జాకెట్, రోప్స్, గ్యాస్ కట్టర్స్ వంటి మౌలిక సదుపాయాలను కచ్చితంగా సమకూర్చాలన్నారు. దిశ మీటింగ్ లో ఎన్డీఎంఏ సేవలను ఒక అంశంగా చేర్చే అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అంతిమంగా "ప్రతి భారతీయుడు - ప్రతి విపత్తుకూ సిద్ధంగా ఉండేలా సంసిద్ధులను చేయాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.



# దీపావళి పండగపై గందరోగళం

## 20నే జరుపుకోవాలన్న కాశీ పండితులు

**వారణాసి, అక్టోబర్ 8:** 'దీపావళి' పండుగ హిందూ మతంలో ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ దీపాల పండుగ కోసం దేశంలోని ప్రతి ఒక్కరు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈసారి దీపావళి పండగ తేదీ విషయంలో కాస్త గందరగోళం నెలకొంది. కొంతమంది జ్యోతిష్కులు దీపావళి పండగను అక్టోబర్ 20న వస్తుందని చెబుతుండగా.. మరికొందరు అక్టోబర్ 21న జరుపుకుంటారని అంటున్నారు. ఈ నేపథ్యంలో దీపావళి పండగను ఏ రోజున జరుపుకోవాలనే చర్చ మొదలయ్యింది. దేశంలోని ప్రముఖ పండితుల సంస్థ 'కాశీ విద్వత్ పరిషత్' ఈ సంవత్సరం దీపావళిని అక్టోబర్ 20న జరుపుకోవాలని స్పష్టం చేసింది. దీపావళి పండగ తేదీల గందరగోళం నేపథ్యంలో తాజాగా కౌన్సిల్ ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో దీపావళి తేదీపై సుదీర్ఘంగా చర్చించారు. మతపరమైన సూత్రాలు, లేఖనాత్మక లెక్కల ఆధారంగా పూర్తి ప్రదోష కాలం అక్టోబర్ 20న మాత్రమే ఉంటుందని తేల్చారు. అక్టోబర్ 21న అమావాస్య మూడున్నర గంటలకు పైగా ఉండటంతో నక్త ఉపవాసం (లక్ష్మి ఆరాధనలో ముఖ్యమైన భాగం) విచ్ఛిన్నం చేయడానికి ఆ రోజు సమయం ఉండదు. అందువల్ల అక్టోబర్ 20న దీపావళిని జరుపుకోవాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా నిర్ణయించింది. కాశీ విద్వత్ పరిషత్ సమావేశం కౌన్సిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రామచంద్ర పాండే అధ్యక్షతన ఇటీవల జరిగింది. ఈ సమావేశానికి కాశీ విద్వత్ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి ,బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రామనారాయణ ద్వివేది హాజరయ్యారు. ద్రిక్ పంచాంగ్ ప్రకారం? ఈ సంవత్సరం అమావాస్య తిథి అక్టోబర్ 20న మధ్యాహ్నం 3:44 గంటలకు ప్రారంభమై అక్టోబర్ 21న రాత్రి 9:03 గంటలకు ముగుస్తుంది. దీపావళి నాడు లక్ష్మి, గణెళిశులను పూజించడానికి అత్యంత పవిత్రమైన సమయం సాయంత్రం 7:08 నుంచి 8:18 వరకు ఉంటుంది. ప్రదోష కాలం, స్థిరమైన లగ్నంతో సమానంగా ఉండే ఈ సమయం లక్ష్మీదేవి అండ్ గణెళిశుడి ఆశీస్సులు పొందడానికి అనువైనదిగా పరిగణించబడుతుంది.

# కాలిఫోర్నియాలో దీపావళి సెలవు

**శానిఫ్రాన్సిస్కో, అక్టోబర్ 8:** భారత్‌లో జరిగే అతిముఖ్యమైన పండగల్లో దీపావళికి ప్రత్యేకత ఉంది. దీపావళి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ దీన్ని ఘనంగా నిర్వహిస్తారు. తాజాగా కాలిఫోర్నియా ఈ పండగను అధికారిక సెలవు రోజుగా ప్రకటించింది. కాలిఫోర్నియా గవర్నర్ న్యూసమ్ ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పండగను అమెరికాలో సెలవు రోజుగా ప్రకటించాలని ప్రతిపాదిస్తూ గతంలో ఆ దేశ కాంగ్రెస్‌లో ఓ బిల్లు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దాన్ని కాలిఫోర్నియా స్టేట్ అసెంబ్లీ ఆమోదించింది. అసెంబ్లీ సభ్యుడు ఆష్ కల్రా ప్రవేశపెట్టిన బిల్లుపై తాను సంతకం చేశానని న్యూసమ్ పేర్కొన్నారు. ఈ బిల్లుపై గతంలో కల్రా మాట్లాడుతూ.. 'కాలిఫోర్నియాలో అత్యధికంగా భారతీయ అమెరికన్లు ఉన్నారు. ఈ పండుగ రోజును అధికారికంగా సెలవుగా ప్రకటిస్తే అది లక్షలాది మంది కాలిఫోర్నియా ప్రజల్లో సంతోషాలు నింపుతుంది. సద్భావన, శాంతి, ఉమ్మడి భావన అనే సందేశాలతో సమాజాన్ని ఈ పండగ ఒకచోట చేర్చుతుంది' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. పెన్సిల్వేనియా, న్యూయార్క్‌లు ఇప్పటికే దీపావళికి అధికారికంగా ఇలాంటి గుర్తింపును ఇచ్చాయి. తాజాగా భారతీయ పర్వదినానికి ఈ రకమైన గుర్తింపు ఇచ్చిన మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. ఈ నిర్ణయంతో ఇక్కడి ఎన్నారైలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# జూబ్లీహిల్ బరిలో దించండి

## బీజేపీని కోరిన మాధవీలత

**హైదరాబాద్, అక్టోబర్ 8:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల అవ్వడంతో రాష్ట్ర రాజధానిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రముఖ రాజకీయ పార్టీలు నేతలు జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంలో ఎవరిని బరిలోకి దించాలా అని చర్చలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ నేత మాధవీలత జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలు సంబంధించి రంగంలోకి దిగారు. బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిపారు. ఇందుకోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్‌ను కలిసినాట్లు ఆమె తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని బీజేపీ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేస్తున్నానని.. ఈ ఉప ఎన్నికలు పార్టీకి చాలా ముఖ్యమైనవని అన్నారు. ప్రజలకు బీజేపీ పట్ల నమ్మకం, ప్రేమ, అభిమానం విపరీతంగా ఉందని మాధవీలత తెలిపారు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనల వల్ల నష్టం జరిగిందని.. ఇప్పుడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. అధిష్ఠానం పరిశీలిస్తున్న అభ్యర్థుల జాబితాలో తన పేరూ ఉందని తెలిసింది. అవకాశం ఇస్తే ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉంటానని ఆమె స్పష్టం చేశారు. అదేవిధంగా.. అవకాశం రాకపోయినా, ఒక పోలింగ్ బూత్ బాధ్యతలు ఇచ్చినా సంతోషంగా స్వీకరిస్తాను. గెలుపు కోసం కృషి చేస్తాను. ఢిల్లీ, వారణాసి, ఝార్ఖండ్, మహారాష్ట్ర వంటి పలు రాష్టాల్లో బీజేపీ గెలుపు కోసం పనిచేశానని తెలిపారు. తన రాజకీయ ప్రయాణం బీజేపీ పెద్దల ఆశీర్వాదం, అభిమానంతోనే కొనసాగుతోందని మాధవీ లత పేర్కొన్నారు. గత 18 నెలలుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నానని ఆమె అన్నారు.

# జూబ్లీహిల్ ఎన్నికల్లో కలసికట్టుగా కృషి

## పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపే లక్ష్యం

## ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి

## పార్టీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం



**హైదరాబాద్, అక్టోబర్ 8:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థి మాగంటి సునీత విజయానికి కృషి చేయాలని భారత రాష్ట్ర సమితి నేతలకు కేటీఆర్, హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, దాన్ని సమర్థంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈమేరకు బుధవారం సమావేశం నిర్వహించారు. మాగంటి సునీత, దివంగత మాగంటి గోపీనాథ్ సోదరుడు వజ్రనాథ్ తదితర పార్టీ నేతలు హాజరయ్యారు. ఎన్నికల బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జిలు సమన్వయంతో పనిచేయాలి. ఎవరికి వారు తమకు అప్పగించిన డివిజన్లలో పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వర్తించాలి. బాకీ కార్డుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాదయాత్రలు నిర్వహించాలి. బూత్ కమిటీలు నిరంతరం ఓటర్లతో సంప్రదింపులు జరపాలి. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి గెలిస్తేనే రాష్ట్ర ప్రభుత్వానికి చెక్ పడుతుందని పేర్కొన్నారు. ప్రచారం చివరి దశలో రోడ్ షోలు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ అధినేత కేసీఆర్ కూడా ప్రచారానికి రావాలని కొందరు నేతలు ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే దీనిపై తదుపరి ఆలోచన చేస్తామని అన్నారు. అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చడంలో విఫలం అయ్యిందన్నారు.

# వరుస లాభాలకు బ్రేక్

## నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని చివరికి నష్టాలతో ముగిసాయి. దీంతో సూచీల నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. క్యూ2 ఫలితాల సీజన్ త్వరలో ప్రారంభం కానుండడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఉదయం 81,899.51 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ఈ క్రమంలోనే 82,257.74 వద్ద గరిష్ఠాన్ని తాకింది. కాసేపటికే మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ఇలా రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. చివరికి 153.09 పాయింట్ల నష్టంతో 81,773.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 62.15 పాయింట్ల నష్టంతో 25,046.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.80గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66.16 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4043.76 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.



## సంపాదకీయం



# పాక్ నయవంచక విధానాలు!

ఆపరేషన్ సిందూర్ ద్వారా చావుదెబ్బతిన్న పాకిస్థాన్.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి, మరింత నష్టం జరక్కుండా చూసుకుంది. లేకుంటే భారత్ చేతిలో చావుదెబ్బ తినివుండేది. కానీ ఇప్పుడా విషయం మరచిపోయింది. మళ్లీ యుద్ధ ప్రేలాపనలు పేలుతోంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్బాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాటలే ఇందుకు నిదర్శనం. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయ లేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అయితే వీటిని ఓ హెచ్చరికగా తీసుకుని జాగ్రత్తగా ఉండాల్సిన పాక్ నేతలు తరచూ మాటలు పేలుతూనే ఉన్నారు. ఇదంతా కేవలం అమెరికా అండచూసుకునే అని వేరుగా చెప్పనక్కరలేదు. అమెరికా కూడా గతాన్ని మరచి పాక్‌కు పాలుపోసి పెంచుతోంది. ఎందుకంటే ద్రోహం, వంచనకు మారుపేరు పాకిస్తాన్. ఇన్నాళ్లు కష్టకాలంలో ఆర్థికంగా, సైనికంగా రక్షిస్తూ వస్తున్న డ్రాగన్ కంట్రీ చైనాకు పాకిస్తాన్ నమ్మకద్రోహం చేస్తోంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లు అమెరికా పంచన చేరి, చైనా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారు. రెండుదేశాల మధ్య పాకిస్తాన్ డేంజరస్ గేమ్ ఆడుతోంది. ఇటీవల, పాకిస్తాన్ ట్రంప్‌తో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగు తోంది. ముఖ్యంగా, ఇరు దేశాల మధ్య ఖనిజ ఒప్పందం కుదిరింది. దీంతో బలూచిస్తాన్ ప్రాంతంలోని రేర్ ఎర్త్ మినరల్స్,రాగి వంటి లోహాలను అమెరికా కొల్లగొట్టడానికి చూస్తోంది. దీనికి పాకిస్తాన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా సహకరిస్తోంది. నిజానికి ఇంతకాలం చైనాతో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది. ఆపరేషన్ సిందూర్ లో కూడా చైనా సాయం తీసుకుంది. అమెరికా దగ్గరకు పిలిచి ముద్దు చేయడంతో ఇప్పుడు చైనాకు చెక్ పెట్టి అమెరికా పంచన చేరింది. అమెరికా, పాకిస్తాన్ స్నేహం భారత్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికా మద్దతుతో పాక్ బలుపు మాటలు మాట్లాడుతోంది. ఇక పస్నీ ద్వారా భారత వ్యూహాత్మక ఓడరేవు చాబహార్‌ని కౌంటర్ చేయవచ్చు. అమెరికా స్నేహం పాకిస్తాన్‌కు మిలిటరీ, ఇంటెలిజెన్స్ వంటి వ్యూహాత్మక సహకారాన్ని అందించవచ్చు. ఈ చర్యల ద్వారా పాకిస్తాన్తన రక్షణ ఒప్పందాలను మెరుగు పరుచుకోవచ్చు. పాకిస్తాన్ భౌగోళిక రాజకీయ విశ్వాసాన్ని పెంచుతుంది. భారత్‌తో పోలిస్తే తన స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ చర్యలు ఇరాన్‌కు కూడా ప్రమాదకరమే. ఇరాన్ షిప్పింగ్ లైన్లపై అమెరికా నిఘా పెరుగుతుంది. అమెరికా, పాక్ బంధంపై భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ట్రంప్ ఇప్పుడు భారత్‌ను ఇబ్బంది పెట్టే ఏ చర్యను కూడా వదలడం లేదు. నిజానికి పాకిస్తాన్ ద్వారా అరేబియా సముద్రానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని 60 బిలియన్ డాలర్లతో చైనా చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రారంభించింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ పోర్టును నిర్మించింది. అయితే, ఇప్పుడు ఈ గ్వాదర్ పోర్టుకు కేవలం 70 మైళ్ల దూరంలో అమెరికాతో కలిసి పస్నీ ఓడరేవును నిర్మించేందుకు పాకిస్తాన్ సిద్ధమైంది. ఇది భారత్ ఇరాన్‌లో నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు కేవలం 178 మైళ్ల దూరంలోనే ఉంది. చైనా, భారత్, ఇరాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలకు కీలమైన ఈ వ్యూహాత్మక స్థానాన్ని పాకిస్తాన్ అమెరికాకు స్థానం కల్పిస్తోంది. ఈ ఓడరేవు అరేబియా, హిందూ మహాసముద్రంలోని సముద్ర భద్రతకు కూడా చిక్కులు కల్పిస్తుంది. ఈ పస్నీ ఓడరేవు ద్వారా బలూచిస్తాన్‌లోని ఖనిజ సంపదను అమెరికాకు తరలించవచ్చని పాకిస్తాన్ భావిస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనిపై రెండు దేశాలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒక వేళ కార్యరూపం దాల్చితే, చైనాతో పాటు భారత్ ప్రయోజనాలకు కూడా తీవ్ర భంగం కలిగించవచ్చు. దీని నిర్మాణానికి 1.2 బిలియన్ డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఓడరేవు బ్యాటరీ టెక్నాలజీ, క్షిపణుల తయారీ, అధునాతన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో ఉపయోగించే రాగి, యాంటిమోనీ, నియోడైమియం వంటి ఖనిజాల ఎగుమతులకు గేట్‌వేగా మారుతుంది. సెప్టెంబర్ 8న పాకిస్తాన్ మిలిటరీ ఇంజనీరింగ్ కార్ప్స్‌తో 500 మిలియన్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. పాకిస్తాన్ ఈ ఖనిజాల షిప్‌మెంట్‌ను మిస్సోరీకి చెందిన జా స్ట్రాటజిక్ మెటల్స్‌కి ఎగుమతి చేసింది. అమెరికాను మచ్చిక చేసుకుని భారత్‌పై పగతీర్చుకోవడానికి పాక్ వెనకాడకపోవచ్చు. ఆ దేశ రక్షణమంత్రి, ఆర్మీ చీఫ్‌లు అడపాదడపా చేస్తున్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిందే.

# భారత్ నిర్ణయాలను శాసించలేం

- ఎవరితో సంబంధాలు కొనసాగించాలన్నది వారి ఇష్టం
- రష్యా చమురు కొనుగోళ్లే భారత్ ఆర్థిక వృద్ధికి కారణం కాదు
- ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ వెల్లడి

**న్యూయార్క్, అక్టోబర్ 8:** అమెరికా అధ్యక్షుడికి మెల్లగా సొంత వర్గం నుంచే వ్యతిరేకత వస్తోంది. ఆయన చర్యలు కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో యాదార్థాలన ముక్కుసూటిగా చెప్పేస్తున్నారు. ప్రధానంగా రష్యా నుంచి భారత్ ఆయిల్ కొనుగోలుపై ట్రంప్ తీరును తప్పుపడుతున్నారు. భారత్ సార్వభౌమత్వ దేశమని ట్రంప్ సలహాదారు జెమిసన్ గ్రీర్ అన్నారు. ఆ దేశం సొంత నిర్ణయాలు తీసుకోగలదని తెలిపారు. ఇతర దేశాలు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి.. ఎవరితో కొనసాగించ కూడదు అనేది మేం చెప్పాలనుకోవడం లేదు. ఈ విషయంలో మేం ఎవర్నీ శాసించడం లేదు అని గ్రీర్ తెలిపారు. రష్యా నుంచి కొనుగోలు చేసే చమురే భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారం కాదని అమెరికా



వాణిజ్య ప్రతినిధి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు జెమిసన్ గ్రీర్ అన్నారు. అయినా ఇప్పటికే భారత్ తన చమురు కొనుగోళ్లను మాస్కో నుంచి మళ్లిస్తోందని తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ది ఎకనామిక్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. కానీ, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో మాస్కో నుంచి చమురును కొనుగోలు చేయలేదు. డిస్కౌంట్ ధరల కారణంగా గత రెండు, మూడేళ్ల నుంచి రష్యా చమురును ఎక్కువగా కొంటోంది. ఇది కేవలం వినియోగం కోసం మాత్రమే కాదు.. ఆ చమురును శుద్ధి చేసి రీసేల్ చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా చమురు కొనుగోళ్లు ఒక్కటే బలమైన ఆధారం కాదని అర్థమవుతోంది. అందుకే వారు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నాం. దీన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు ఈ విషయంలో వైవిధ్యభరిత చర్యలు ప్రారంభించడం మేం చూస్తున్నాం అని గ్రీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. అమెరికాతో వాణిజ్యం కారణంగా భారత్‌కు 40 బిలియన్ డాలర్లకు పైగా మిగులు ఉంటోంది. మేం వారికి విక్రయించే దానికంటే.. భారత్ మాకు అమ్మేవే ఎక్కువ. అయితే, రష్యా చమురును కొనుగోలు చేయడంతో ఉక్రెయిన్‌పై యుద్ధానికి పుతిన్‌కు న్యూదిల్లీ వనరులను అందించినట్లవుతోంది. మాస్కోపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఈ స్థాయిలో సుంకాలు విధించాల్సి వచ్చింది. అయితే, టారిఫ్‌ల విషయంలో అమెరికాతో ఆ దేశం గొప్ప డీల్ చేసుకుంటోందని గ్రీర్ వెల్లడించారు. దీనిని బట్టి మెల్లగా వాస్తవాలను ట్రంప్ బృందం గుర్తిస్తోందని తెలుస్తోంది.

# బంగారం ధరల దూకుడు


**రోజురోజుకు సరికొత్త రికార్డు ● తాజాగా రూ.1.25 లక్షలకు చేరిక**

**హైదరాబాద్, అక్టోబర్ 8:** ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారం ధరలు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. బంగారం ధర రోజుకో సరికొత్త రికార్డును నమోదు చేస్తోంది. మొన్నటి వరకు 10 గ్రాముల ధర రూ.లక్ష దాటితేనే ఔరా అనుకున్న వాళ్లంతా.. తాజాగా రూ.1.25 లక్షలకు చేరుకోవడం చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అంతర్జాతీయంగానూ పుత్తడి ఔన్సు తొలిసారి 4వేల డాలర్ల మార్కును దాటింది. అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్, ఆ దేశ ఆర్థిక పరిస్థితిపై నెలకొన్న అనిశ్చితులు పసిడికి తాజాగా డిమాండ్ పెంచుతున్నాయి. బంగారం ధర బుధవారం మరింత పెరిగింది. ఒక్కరోజే రూ.2,290 పెరిగి ఆల్‌టైమ్ హైకి చేరింది. బుధవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర తొలిసారి రూ.1,26,070కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,750కి చేరింది. మరోవైపు వెండి ధర కూడా బంగారంతో పోటీపడి మరీ పెరిగిపోతోంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.58 లక్షలుగా ఉందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. పసిడి ధరలు పెరగడానికి అనేక కరాణాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ అధిక టారిఫ్‌లు, అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితులకు తోడు అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ కూడా ఓ కారణంగా పేర్కొంటున్నాయి. వడ్డీరేట్లను ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఇంకా తగ్గిస్తుందన్న అంచనాల మధ్య మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత సాధనమైన పుత్తడి వైపునకు మళ్లిస్తున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. దీంతో పసిడి ధరలు అంతకంతకూ పెరుగుతూ పోతున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,25,780 వద్ద కొనసాగు తోంది. 22 క్యారెట్ల పసిడి రూ.1,12,900 పలుకుతోంది. అటు వెండి సైతం కిలో రూ.1.56 లక్షలు దాటింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4034 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 48.62 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.79గా ఉంది.అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు బంగారానికి డిమాండ్ పెంచుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యంపై టారిఫ్‌ల ప్రభావం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు, కేంద్ర బ్యాంకులు కొనుగోళ్ల కారణంగా సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే పుత్తడి వైపు పెట్టుబడులు మళ్లడమే దీనికి కారణం. దాదాపు రెండేళ్లక్రితం ఔన్సు బంగారం ధర 2 వేల డాలర్ల దిగువనే ఉండేది. అలాంటిది ఈ ఒక్క క్యాలెండర్ సంవత్సరంలోనే దాదాపు 50 శాతం మేర పెరగడం గమనార్హం. ఈ పెరుగుదలతో పసిడి కొనుగోళ్లకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. పండగ సీజన్‌లో వ్యాపారాలు తగ్గడంతో ఆభరణ వ్యాపారులు సైతం ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# భారత్‌తో యుద్ధ ప్రమాదం తొలగిపోలేదు

**అలాంటిది వస్తే ఈసారి మాదే పైచేయి**

**పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్**



**లాహోర్, అక్టోబర్ 8:** ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్బాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫ లితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు.పాక్ మీడియాకు ఇచ్చిన ఇంట ర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లే దు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాల ను కొట్టిపారేయలేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరు గైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్ర వాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు.ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. 'భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అంతేగాక, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సైనికులను ఆదేశించారు. పూర్తి సన్నద్ధంగా ఉండండి. దేవుడు వాంఛిస్తే ఆ అవకాశం త్వరలోనే మనకు వస్తుంది అని భారత జవాన్లకు ఆయన పిలుపునిచ్చారు.

# మయన్మార్‌లో తీవ్ర విషాదం

**బౌద్ధ ఉత్సవంపై బాంబులతో దాడి**

**24 మంది మృత్యువాత..47మందికి తీవ్ర గాయాలు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:** మయన్మార్‌లో విషాదం చోటుచేసుకుంది. బౌద్ధ ఉత్సవంపై పారాగ్లైడర్ బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో 24 మంది మృతి ప్రాణాలు కోల్పోయారు. 47 మంది గాయపడ్డారు. గుమిగూడిన జనంపై రెండు బాంబులు వేయడంతో 24 మంది చనిపోయారని జుంటా వ్యతిరేక పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్‌కు చెందిన స్థానిక అధికారి తెలిపారు. 47 మంది గాయపడ్డారని చెప్పారు. బౌద్ధ మూలాలతో కూడిన జాతీయ సెలవుదినం అయిన థాడింగ్యుట్ పండుగ కోసం సోమవారం సాయంత్రం చాంగ్ యు టౌన్‌షిప్‌లో సుమారు 100 మంది గుమిగూడి ఉండగా ఈ దాడి జరిగింది. థాడింగ్యుట్ పండుగను లైట్ల పండుగ అని కూడా పిలుస్తారు. మయన్మార్ అంతటా కొవ్వొత్తులు, లాంతర్లు. సామూహిక సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సమావేశం సైనిక నిర్బంధం, రాబోయే ఎన్నికలను నిరసిస్తూ.. అలాగే ఆంగ్ సాన్ సూకీతో సహా రాజకీయ ఖైదీల విడుదల కోసం కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. 2021 తిరుగుబాటులో సైన్యం అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటి నుంచి మయన్మార్ అంతర్యుద్ధంలో కొట్టుమిట్లాడుతోంది. అప్పటి నుంచి 5,000 మందికి పైగా పౌరులు మరణించారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా విమానాలు, జెట్ ఇంధన కొరత మధ్య తరచుగా ఆకాశం నుంచి మోర్టార్ తూటాలను జారవిడిచే పారామోటర్ దాడులను సైన్యం ఎక్కువగా ఉపయోగిస్తోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో కూడా చాంగ్ యు టౌన్‌షిప్‌లో కూడా ఇలాంటి దాడులు జరిగినట్లుగా అమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదించింది. ఇక సైన్యం తిరుగుబాటు తర్వాత మొదటిసారిగా డిసెంబర్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి.

# స్వదేశీ టెక్నాలజీకి ఆదరణ

**జోహో మెయిల్‌కు మారిన కేంద్ర మంత్రులు**

**ఈ జాబితాలో తాజాగా చేరిన అమిత్ షా**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:** దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో కేంద్రమంత్రులు సిద్దం అవుతున్నారు. స్వదేశీ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు, డిజిటల్ ఇండియాలో భాగంగా 'జోహో' ప్లాట్‌ఫామ్ వైపు మొగ్గుచూపుతున్నారు. అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ ఆ సంస్థ సేవలు వినియోగిస్తుండగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోహో మెయిల్‌లోకి మారిపోయారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. హలో.. నేను జోహో మెయిల్‌కు మారాను. నా ఈమెయిల్ చిరునామాలో ఈ మార్పును గమనించండి. నా కొత్త మెయిల్ అడ్రస్ గురించి అమిత్ షా తన పోస్టులో రాసుకొచ్చారు. ఇకనుంచి మెయిల్స్ అన్నీ ఈ కొత్త అడ్రస్‌కే పంపాలని చెప్పారు. భారత్‌పై అమెరికా సుంకాల మోత, జీఎస్టీ సంస్కరణల వేళ ప్రధాని మోదీ 'స్వదేశీ' పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. భారత్ బలమైన దేశంగా ఎదుగుతున్న వేళ.. కొన్ని సవాళ్లు తప్పవు. అటువంటి సమయాల్లో 'ఆత్మనిర్భర్' స్ఫూర్తిని కొనసాగించాలి. ఈ నేపథ్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి అని ఎన్డీయే ఎంపీలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే మంత్రులు జోహో సేవలను వినియోగిస్తున్నారు. జీమెయిల్, మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్‌కు పోటీగా జోహో మెయిల్‌ను తీసుకువచ్చారు. ఇప్పుడు ఈమెయిల్‌లోకి అమిత్ షా మారగా.. మైక్రోసాఫ్ట్ పవర్‌పాయింట్ బదులు జోహోతోనే కేబినెట్ ప్రజెంటేషన్ తయారు చేసినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. జోహో రూపొందిన మెసేజింగ్ యాప్ 'అర్టటై'ని వాడాలంటూ ధర్మేంద్ర ప్రదాన్ ఇంతకుముందు పిలుపునిచ్చారు. ప్రస్తుతం అర్టటైకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ యాప్‌ను విపరీతంగా డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. యూజర్ల ప్రైవసీ కోసం త్వరలోనే 'అర్టటై'లోనూ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తాజాగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో సమాచార గోప్యతపై పెద్దఎత్తున చర్చ జరుగుతోన్న సమయంలో ఈ స్పందన వచ్చింది.



# పెట్టుబడుల ఆకర్షణలో సరికొత్త అధ్యాయం

మొదటి పేజీ తరువాయి

తెలియచేసింది. విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం సమీపంలోని రాంబిల్లి వద్ద మూడు క్యాంపస్‌లలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా ఈ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 67,218 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దాదాపు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశం..ఇంధన రంగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఏరో స్పేస్, ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగాలతో పాటు పర్యాటకానికి ఊతం ఇచ్చేలా ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులకు ఆమోదాన్ని తెలియచేసింది. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ద్వారా దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఏపీకి సాధించటంపై ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు అభినందనలు తెలియచేశారు. క్వాంటం వ్యాలీ తరహాలోనే డేటా సెంటర్లు ఏపీకి టెక్నాలజీ గేమ్ చేంజర్‌గా మారతాయని అన్నారు. కేవలం 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. డేటా సెంటర్లతో ఓ ఎకో సిస్టం వస్తోందని.. విశాఖ నగరం తదుపరి స్థాయి ఏఐ సిటీగా మారుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ తక్కువ ధరకు అందిస్తే ఐటీ రంగానికి మేలు జరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 6.20 లక్షల మందికి నేరుగా ఉద్యోగాలు దక్కనున్నాయి.

### ప్రాంతాల వారీగా పారిశ్రామిక ప్రాజెక్టుల అభివృద్ధి

క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న ఈ డేటా సెంటర్లు టెక్నాలజీ రంగంలో కీలక మలుపు అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. విశాఖ పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎకనమిక్ కారిడార్ తరహాలోనే రాయలసీమకూ ఓ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. ఆమేరకు మూడు ప్రాంతాలను పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నామని అదే తరహాలో అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకూ ఒక ఆర్థిక ప్రగతి రీజియన్‌ను , నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో ఎకనామిక్ డెవలప్మెంట్ రీజియన్లను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ , డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు అభివృద్ధి అవుతున్నాయని సీఎం అన్నారు. వీటితో పాటు ఉద్యాన పంటలకు కేంద్రంగా ఉన్న రాయలసీమ ఆగ్రో ప్రాసెసింగ్ హబ్‌గా మారుతోందని త్వరలోనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన కేంద్రంగా ఈ ప్రాంతం మారుతుందని అన్నారు. అమరావతి రాజధాని నగరం క్వాంటం వ్యాలీతో నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా మారుతుందని సీఎం అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును కూడా అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీని కోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసుకుని ప్రాజెక్టులను ఆహ్వానించాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు వచ్చినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాజెక్టులను రైల్వే లైన్‌కు కూడా అనుసంధానిస్తే లాజిస్టిక్స్ వ్యయం తగ్గి ఆయా ప్రాజెక్టులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విలువ జోడింపుపైనా దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పర్యాటకులకు నాణ్యమైన వసతి



లభించేలా చూడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వివిధ కేటగిరీల హోటళ్లకు అనుబంధంగా ఎకో సిస్టం కూడా వచ్చేలా చూడాలని సూచించారు. తిరుపతిలో ఉన్న కలినరీ ఇనిస్టిట్యూట్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచి వివిధ సంస్థలను అనుసంధానించాలని పేర్కొన్నారు. కూచిపూడి, థింసా లాంటి సంప్రదాయాలతో పాటు వివిధ ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటీవల విజయం సాధించిన విజయవాడ ఉత్సవ్ తరహాలోనే విశాఖ, రాజమహేంద్రవరం లాంటి చోట్ల కూడా ఉత్సవ్‌లను నిర్వహించాలని సూచించారు.

### మెగా పారిశ్రామిక ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

అమెరికాలో వర్జీనియా నగరం డేటా వ్యాలీగా ఉందని.. ప్రస్తుతం విశాఖ కూడా రైడెన్, గూగుల్ ప్రాజెక్టులతో డేటా వ్యాలీగా రూపొందుతుందని ఐటీ మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రికి వివరించారు. టీసీఎస్ సంస్థ కూడా ఇక్కడ త్వరలోనే క్యాంపస్‌ను ప్రారంభించనుందని.. ఒక్క విశాఖ నగరంలోనే 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. ఐటీ సంస్థల్లు, అందులో పనిచేసే ఉద్యోగులకు హౌసింగ్‌తో పాటు రహదారులు, ఇతర మౌలిక వసతులు ఉండేలా ప్రణాళికలు చేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌తో స్థానిక టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. వీటితో పాటు 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రామాయపట్నం సమీపంలో వస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీతో పాటు ఆర్సెలార్ మిట్టల్, రైడెన్ డేటా సెంటర్ లాంటి భారీ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యే వరకూ పర్యవేక్షణ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించాలని అన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు లాజిస్టిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నీటి సరఫరా, వినియోగం లాంటి అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. 2028 నాటికల్లా జిందాల్ స్టీల్ ప్లాంట్ పూర్తి చేసేలా చూడాలని సీఎం పరిశ్రమల శాఖను ఆదేశించారు. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు సీఎస్ కె.విజయానంద్, పరిశ్రమలు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### 11వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు ఇవీ

1. యాక్మే ఊర్జా ఒన్ లిమిటెడ్ – అనంతపురం జిల్లాలో సౌర విద్యుత్ ప్రాజెక్టులో రూ.2 వేల కోట్ల పెట్టుబడి, 1380 మందికి ఉద్యోగాలు
2. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ అనంతపురం జిల్లాలో 400 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు రూ.2 వేల కోట్ల పెట్టుబడి, 1,380 మందికి ఉద్యోగాలు
3. చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ విజయనగరం జిల్లాలో పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టు రూ.12,905 కోట్ల పెట్టుబడి, 3వేల మందికి ఉద్యోగాలు
4. ఆంప్లిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టు రూ.15.10 కోట్లు పెట్టుబడి
5. రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ కర్నూలు జిల్లా ఓర్వకల్లు లో ఎఫ్ఎంసీజీలో రూ.758 కోట్ల పెట్టుబడులు, 500 మందికి ఉద్యోగాలు
6. గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ రూ.208 కోట్ల పెట్టుబడులు, 66 మందికి ఉద్యోగాలు
7. ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ రూ.201 కోట్ల పెట్టుబడి, 436 మందికి ఉద్యోగాలు
8. ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.33 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు
9. దస్పల్లా అమరావతి హోటల్స్ అమరావతిలో రూ.200 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు
10. వీఎస్కే హోటల్స్ రిసార్ట్స్ అరకు వ్యాలీలో రూ.55 కోట్ల పెట్టుబడి, 98 మందికి ఉద్యోగాలు
11. శ్రీవేంకటేశ్వరా లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీశైలంలో రూ.83 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు
12. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ అమరావతిలో రూ.117 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు
13.. మైరా బే వ్యూ రిసార్ట్స్ కొత్తవలసలో కన్వెన్షన్ సెంటర్‌కు రూ.256 కోట్ల పెట్టుబడి
14. ఎస్వీఎస్ కనస్ట్రక్షన్స్ కాకినాడ లో రూ.87 కోట్ల పెట్టుబడి,
15. రైడన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.87,520 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు.
16. ఇమాజినేటివ్ టెక్నో సొల్యూషన్స్ ఇండియా విశాఖ కాపులుప్పాడ లో ఐటీ లాజిస్టిక్స్ రూ.140 కోట్ల పెట్టుబడి, 2600 మందికి ఉద్యోగాలు
17. శాన్వీరా ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనకాపల్లిలో అడ్వాన్స్డ్ కార్బన్ కాంప్లెక్స్ రూ.2600 కోట్ల పెట్టుబడి, 800 మందికి ఉద్యోగాలు
18. శ్రీ సిమెంట్ లిమిటెడ్, పలనాడులో సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ రూ.2260 కోట్ల పెట్టుబడి, 350 మందికి ఉద్యోగాలు
19. రేమండ్, జేకే మైనీ ప్రెసిషన్ టెక్నాలజీ అనంతపురంలో ఏరో స్పేస్ ఆటోమోటివ్ కాంపోనెంట్ రూ.430 కోట్ల పెట్టుబడి, 4,096 మందికి ఉద్యోగాలు
20. రేమాండ్ జేకే మైనీ గ్లోబల్ ఎరోస్పేస్ లిమిటెడ్, అనంతపురంలో ఏరోస్పేస్ కాంపోనెంట్లు రూ.510 కోట్ల పెట్టుబడి, 1400 మందికి ఉద్యోగాలు.
21. భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద రూ.1200 కోట్ల పెట్టుబడి, 1400 మందికి ఉద్యోగాలు
22. అలీప్ ఓర్వకల్లు వద్ద మహిళా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కోసం రూ.36.25 కోట్ల పెట్టుబడి, 3000 మందికి ఉద్యోగాలు
23. అవంతీ వేర్ హౌసింగ్ సర్వీసెస్ విశాఖలో గుర్రమ్ పాలెం, రూ.319 కోట్ల పెట్టుబడి
24. అస్సెల్ ఈఎస్ జీ కర్నూలు జిల్లా కృష్ణగిరిలో రూ.300 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు
25. ఫెయిర్ ఎక్స్ పోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడ మల్లవెల్లి లో మెగా ఫుడ్ పార్క్ కోర్ ప్రాసెసింగ్ సెంటర్
26. జెఎస్ డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్, విజయనగరంలో ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్క్, రూ.531 కోట్ల పెట్టుబడి, 45000 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

# అమరావతితో పాటు స్థానిక రైతులూ అభివృద్ధి చెందాలి



**అమరావతి:** రాజధాని అభివృద్ధితో పాటు... రాజధానికి భూములిచ్చిన రైతులు కూడా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను తక్షణం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 53వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. మొత్తంగా 18 అంశాలపై అథార్టీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాజధాని నిర్మాణ పనులు రీ-స్టార్ట్ చేశాం. రాజధాని కోసం భూములను త్యాగం చేసిన రైతులకే మొదటగా రాజధాని అభివృద్ధి ఫలాలు అందాలి. రాజధాని రైతులకు కౌలు చెల్లింపుల్లోనూ ఎలాంటి జాప్యం జరగకూడదు. భూములిచ్చిన రైతులకు ఎక్కడ రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని చెప్పామో... అక్కడే ఇవ్వాలి. ఏ ఊళ్లో భూములిచ్చిన వారికి ఆ ఊళ్లోనే ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చాం.. అలాగే ఎలాట్మెంట్ చేయాలి. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెరగాలి. సెక్రటేరియేట్ టవర్లతో సహా ఇతర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి. వెస్ట్ బైపాస్ రోడ్డును వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. ఏమైనా సాంకేతిక ఇబ్బందులుంటే.. వాటిని వెంటనే పరిష్కరించుకుని ఖాజా టోల్ గేట్ దగ్గర జాతీయ రహదారిని చేరేలా ఉన్న రోడ్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి. కరకట్ట రోడ్డును విస్తరించాలి. మూడు నెలల్లో రాజధాని నగరాన్ని ఓ రూపునకు తీసుకురావాలి." అని సీఎం చెప్పారు. రాజధానిలో గవర్నర్ నివాసం రాజ్ భవన్ నిర్మాణానికి సీఆర్డీఏ అథార్టీ ఆమోదించింది. రూ. 212 కోట్ల వ్యయంతో రాజ్ భవన్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. కృష్ణా నదీ ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్ భవన్ నిర్మాణం జరగనుంది. రాజ్ భవన్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్ అద్భుతంగా ఉండాలని సీఎం సూచించారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 25 శాతం నిధులను సీఆర్డీఏ ఇచ్చేందుకు అథార్టీ ఆమోదం తెలిపింది. రాజధాని ప్రాంతంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి అథార్టీ అంగీకరించింది. రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో గ్రీన్ సర్టిఫైడ్ భవనాలు ఉండేలా అవసరమైన మార్పులు చేర్పులు అథార్టీ ఆమోదించింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా సీఆర్డీఏ వ్యవహరించేలా అథార్టీలో నిర్ణయించారు. హ్యాపీ నెస్ట్, ఏపీ ఎన్నార్టీ ప్రాజెక్టులకు చెందిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజును మాఫీ చేసేందుకు అథార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజధానిలో నిర్మించే హోటళ్ల వద్ద పార్కింగ్ నిబంధనల్లోనూ స్వల్ప మార్పులు చేసేందుకు అథార్టీ అంగీకరించింది. కొండవీడు వాగు సమీపంలో నీటి ప్రవాహాల కోసం 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అథార్టీ నిర్ణయించింది. దీంతో పాటు మరికొన్ని సాంకేతిక అంశాలకు, పరిపాలనా అంశాలకు అథార్టీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం కొన్ని సూచనలు చేశారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉందని... పార్కింగ్ సమస్య లేకుండా ప్రణాళికలు చేయాలని సూచించారు. అమరావతి రాజధానిలో రోడ్డుపై వాహనాల పార్కింగ్ చేసే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. కామన్ పార్కింగ్ ప్రాంతాలు ఉండేలా ప్రణాళికలు చేయాలని సీఎం అధికారులకు చెప్పారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి కార్పోరేషన్లు, తెనాలి మున్సిపాలిటీ, రాజధాని ప్రాంతంతో ఇంటిగ్రేట్ చేయాలని... బ్లూ గ్రీన్ అమరావతిగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఆర్డీఏ అథార్టీ సమావేశానికి మంత్రి నారాయణ, సీఎస్ కె.విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీ, మౌలికసదుపాయాల కల్పన శాఖ ఉన్నతాధికారులు హజరయ్యారు.



# బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

మొదటి పేజీ తరువాయి

సంభవించడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాణసంచా పరిశ్రమ యజమాని సత్తిబాబు కూడా ఉన్నట్లు సమాచారం. సమాచరం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో 40 మంది కార్మికులు అందులో పనిచేస్తున్నారు. భారీ పేలుడు ధాటికి బాణసంచా తయారీ కేంద్రం షెడ్డు గోడ కూలింది. శిథిలాల కింద మరికొందరు ఉండొచ్చని సమాచారం. ఘటనాస్థలిని రామచంద్రపురం ఆర్డీవో అఖిల పరిశీలించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ స్పందించారు. వారం క్రితమే బాణసంచా తయారీ కేంద్రాన్ని స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి అన్ని రక్షణ చర్యలు ఉన్నట్లు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. అగ్నిప్రమాద నివారణ పరికరాలను గోదాము యజమానులు సక్రమంగా వినియోగించారా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటు న్నామన్నారు. బాణసంచా పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో పలువురు చనిపోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయకచర్యలు, వైద్యసాయంపై వివరాలను అధికారుల నుంచి ఆయన తెలుసుకున్నారు. ఘటనాస్థలికి వెళ్లి సహాయకచర్యల్లో పాల్గొనాలని చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి తెలిపారు.

### పేలుడు ఘటనపై మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి బాధితులకు అండగా ఉంటామని ప్రకటన

కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రి లోకేష్ స్పందించారు. రాయవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం పాలవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మంటల్లో చిక్కుకుని కార్మికులు సజీవ దహనం కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీసిందని తెలిపారు. క్షతగాత్రు లకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ తన ప్రగాఢ సాన-ుభూతిని తెలియజేశారు. కోనసీమ జిల్లాలో బాణసంచా పేలుడు ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఘటనలో పలువురు చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక అధికారులతో మాట్లాడి బాధితులకు అందిస్తున్న సహాయ చర్యలను అడిగి తెలుసుకున్నారు మంత్రి. ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. బాణసంచా తయారీ సమయంలో భద్రతా నిబంధనల అమలుపై దృష్టి పెట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు.

# జగన్ పర్యటనకు ఇన్ని ఆంక్షలా

**విశాఖపట్నం :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు సంబంధించిన పోలీసులు ఇచ్చిన కొత్త రూట్‌ను తాము అంగీకరిస్తున్నామని మాజీ మంత్రి గుడివాడ అమ-ర్‌నాథ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పర్యటనకు అనుమతి ఇస్తూనే 18 కండిషన్లు పెట్టారన్నారు. పోలీసులు ఇన్ని నిబంధనలు పెట్టడం సమంజసం కాదని... పునఃసమీక్షించుకోవాలని కోరుతున్నామని మాజీ మంత్రి తెలిపారు. గురువారం జగన్ పర్యటన ఎయిర్ పోర్టు నుంచి ఎన్ఏడి కొత్త రోడ్డు, గోపాల పట్నం, వేపగుంట, అనకాపల్లి మీదగా ప్రయాణిస్తారని... నర్సీపట్నం మెడికల్ కళాశాలకు వెళ్తారని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు తమ బాధను చెప్పుకోవడానికి ఎయిర్ పోర్టుకు కానీ మార్గం మధ్యలో ఎక్కడికైనా రావాల్సిందిగా కోరుతున్నామన్నారు. పోలీసుల రూట్ మార్చినంత మాత్రాన వైసీపీ తన మాటను మార్చదని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణకు వైసీపీ ఎప్పుడూ వ్యతిరేకమే అని.. తమ స్టాండ్ మారలేదని గుడివాడ అమర్‌నాథ్ తేల్చిచెప్పారు. ప్రజా ఉద్యమంలో భాగంగానే నర్సీపట్నం మెడికల్ కళాశాలకు జగన్ వస్తున్నారని మాజీ మంత్రి విడదల రజనీ తెలిపారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఉండాలన్నది జగన్ ఆలోచన అని అందుకే 17 కళాశాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో 5 కళాశాలలను ఆల్రెడీ ప్రారంభించామన్నారు. నర్సీపట్నం మెడికల్ కాలేజీకి సంబంధించి 2023 సంవత్సంలో జీఓ నెంబర్ 39 ఇచ్చామని గుర్తుచేశారు. ఈ మెడికల్ కాలేజీని 500 కోట్లతో నిర్మించ నున్నామని జీవో ఇచ్చాం.. ఈ జోవోను చూసి అయినా కూటమి నేతలు మాట్లాడాలి కదా అని ప్రశ్నించారు. నర్సీపట్నంలో ల్యాండ్ లేదని, కాలేజీ లేదని, పర్మిషన్లు లేవని అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఇలా మాట్లాడిన నేతలు అంతా జగన్ కార్యక్రమానికి రావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. వస్తే వివరాలు అందిస్తామని.. కాలేజీ నిర్మాణం ఎంత వరకు వచ్చిందో కూడా చూపిస్తామని మాజీ మంత్రి విడదల రజనీ పేర్కొన్నారు.

# వ్యాపార సంస్థలపై రెండోరోజూ ఐటీ దాడులు

**విజయవాడ :** వ్యాపార సంస్థలపై ఆదాయపుపన్నుశాఖ అధికారుల దాడులు వ్యాపార వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. గుంటూరు నగరంలోని కందిపప్పు కమీషన్ ఏజెంట్ వెంకటేశ్వరరావు నివాసంలో ఆదాయ పన్నుశాఖ అధికారుల తనిఖీలు రెండో రోజూ కొనసాగాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో కందిపప్పు సరఫరా కాంట్రాక్టు పొందిన వెంకటేశ్వరరావు.. ఆదాయపన్ను చెల్లించలేదు. 30 ఏళ్లుగా కమీషన్ వ్యాపారంతోపాటు రియల్ ఎస్టేట్, బంగారం వ్యాపారం చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ దుకాణంలో ఐటీ సోదాలు నిర్వహించగా.. గుంటూరు, విశాఖపట్నంలోని కమీషన్ ఏజెంట్లకు పెద్ద మొత్తాల్లో బంగారు బిస్కెట్లు అమ్మినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విజయవాడలోని ఐటీ దర్యాప్తు విభాగం ఆధ్వర్యంలో 30 బృందాలుగా ఏర్పడి గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, వినుకొండ ప్రాంతాల్లోని దాల్ మిల్లు వ్యాపారుల ఇళ్లు, వ్యాపార ప్రాంతాల్లో సోదాలు చేస్తున్నారు. గుంటూరు దర్గారోడ్డులోని ఓ బహుళ అంతస్తుల సముదాయంలోని వెంకటేశ్వరరావు ఫ్లాట్‌లో బుధవారం సోదాలు కొనసాగించారు. గుంటూరులోని కమీషన్ ఏజెంట్ సంస్థపై నిర్వహించిన తనిఖీల్లో కీలక సమాచారం లభ్యమైంది. కందిపప్పు, పచ్చిపప్పు వ్యాపారంతోపాటు రూ.కోటి, రూ.2 కోట్ల విలువైన చిట్టీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

# ఏటీసీలలో సాంకేతిక నైపుణ్యతతో కూడిన శిక్షణను అందించాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.**





**వికారాబాద్, అక్టోబర్,08(సమయం న్యూస్) :** బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఆధునాతన సాంకేతిక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏటీసీలో గల సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏటీసీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులతో కావలసిన మౌలిక సదుపాయాలు,వివిధ సౌకర్యాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణ నిమిత్తం వచ్చిన విద్యార్థులకు ఆధునాతన సాంకేతికలో పట్టు సాధించే విధంగా విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏటీసీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. ఏటీసీలో ఫర్నిచర్ లేని పరిస్థితిని గ్రహించిన కలెక్టర్ విద్యార్థులకు సరిపోను కుర్చీలను సమకూరుస్తానని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ సందర్శనలో భాగంగా ప్రిన్సిపాల్ నరేంద్ర బాబు ఏటిసి ఇంచార్జ్ ఎస్.ఎం. సరూష్, ఏటి సిబ్బంది ఉన్నారు.

## మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్.





**వరంగల్ అక్టోబర్ 8. (సమయం న్యూస్) :** వరంగల్ తూర్పు నియోజకవర్గంఈ రోజు పెరుక వాడలో మాజీ కార్పొరేటర్ యంబడి రవీందర్ గారి సంవత్సరిక కార్యక్రమానికి హాజరైన గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ % వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ తుమీకి రమేష్ బాబు గారు 24 డివిజన్ ముఖ్యులు సీతారాం మరియు సోను 33 డివిజన్ మహిళా నాయకురాలు మన్నెమ్మ,పద్మ రేణుక, విజయ, అనసూయ పాల్గొన్నారు

# రాయపోల్ జడ్పీటీసీ బరిలో మౌనిక - రాజిరెడ్డి



**రాయపోల్,అక్టోబర్ 8:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాయపోల్ మండలం నుండి జడ్పీటీసీ బరిలో తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు రాజిరెడ్డి సతీమణి మౌనిక పోటీలో నిలవడానికి సన్నాహాలు జరుగుతున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. 2001లో తెలంగాణ ఉద్యమ ప్రారంభ దశ నుంచే అప్పటి టీఆర్ఎస్, ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీతో రాజిరెడ్డి కొనసాగుతూ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 2004లో విద్యార్థి విభాగంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, తదితర హెూదాల్లో సేవలందించారు. మునుపటి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాయపోల్ మండల కేంద్ర సర్పంచ్‌గా మౌనిక భారీ మెజార్టీతో విజయం సాధించి ఐదు సంవత్సరాల పాటు ప్రజలకు అంకితభావంతో సేవలందించారు. కరోనా మహమ్మారి సమయంలో మండలంలో ఎవరైనా మరణిస్తే, కుటుంబ సభ్యులు ఇబ్బంది పడకుండా తానే స్వయంగా అంత్యక్రియలు నిర్వహించడం ద్వారా మానవతా దృక్పథాన్ని ప్రదర్శించారు. ప్రజల్లో ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా రాజిరెడ్డి దంపతులు మంచి పేరు సంపాదించారు. ఉద్యమ సమయంలో అనేక కేసులు ఎదుర్కొని జైలుకు వెళ్లిన రాజిరెడ్డి, ప్రజా సేవలో తన నిబద్ధతను చాటుకున్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు కి, దుబ్బాక ఎమ్మెల్యే శ్రీ కొత్త ప్రభాకర్ రెడ్డి కి రాజిరెడ్డి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. పార్టీ అవకాశమిస్తే ప్రజల సహకారంతో విజయం సాధించి,రాయపోల్ మండల అభివృద్ధికి అంకితభావంతో సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని మౌనిక తెలిపారు. రాబోయే జడ్పీటీసీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందుతాననే నమ్మకం వ్యక్తం చేశారు.

# నోడల్ అధికారి శంకర్ నాయక్‌ని కలిసి జీతాలు రావడం లేదని వినతి పత్రం అందించిన జూనియర్ కళాశాల అతిథి అధ్యాపకులు

**దౌల్తాబాద్ మండలం,అక్టోబర్,08(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లాలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు, జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్ ని కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న తమ 9నెలల జీతాన్ని చెల్లించేవరకు విధులకు హాజరుకామని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన 4నెలల జీతాలు ఇప్పటివరకు రాలేదని, ఈ విద్యా సంవత్సరం ప్రారంభయ్యి 5నెలలు గడుస్తున్నా కూడా ఇంకా జీతాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 9నెలలు జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటూ, కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. చేసిన అప్పులు తీర్చలేక సమాజంలో అవమానాన్ని ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే అధ్యాపకుల జీవితాల్లోనే వెలుగు లేకుండా పోయిందని, వీలైనంత తొందరగా పెండింగ్ జీతాలను విడుదల చేసి, మమ్మల్ని మా కుటుంబాలని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సకాలంలో జీతాలు రాక, రెనివల్ రాక అతిథి అధ్యాపకుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, శాంతియుతంగా మాకు రావలసిన వేతనాలను మేము అడుగుతున్నామని, మా జీతాలు



చెల్లించే వరకు విధులకు హాజరుకాబోమని పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న 11మంది అధ్యాపకులు తమ విధులను బహిష్కరించారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద పండుగ అయినా దసరా కి కూడా తమ జీతాలు రాకపోవడంతో, కుటుంబంతో కలిసి పండగను కూడా సంతోషంగా జరుపుకోలేదని బాధను వ్యక్తం చేశారు. కనీసం దీపావళి వరకైనా జీతాలను చెల్లించి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ప్రభుత్వం తమ పెండింగ్ జీతాలను విడుదల చేసేవరకు విధులకు హాజరుకామన్నారు. 11మంది అధ్యాపకులు కాలేజికి హాజరుకాకపోవడంతో ఈరోజు కాలేజీ లో క్లాసులు జరగలేదని విద్యార్థులు తెలిపారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి సిగ్గుండాలి

- బడుగు బలహీన వర్గాల ఉత్తమ విద్యార్థులను
- ఇంత కఠినంగా ఇబ్బంది పెడుతున్న
- ప్రభుత్వం వెంటనే వీరి సమస్యలను పరిష్కరించాలి
- ఎర్రబెల్లి ప్రదీప్ రావు .




**వరంగల్ అక్టోబర్ 8. (సమయం న్యూస్) :** బీఏఎస్ స్కాలర్‌షిప్‌ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వంపై డిమాండ్, విద్యార్థులు మరియు విద్యార్థుల యొక్క తల్లితండ్రులకు మద్దతు తెలిపిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు. బీఏఎస్ స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, పిడిఎస్యూ, ఎంఎస్ఎఫ్, ఏబీఎస్ఎఫ్ మరియు ఐక్య విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించి, కలెక్టర్ విజయలక్ష్మి గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. విద్యార్థుల తరపున ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపిన బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు మాట్లాడుతూ



రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అండగా ఉంటామని ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మాట తప్పి, విద్యార్థి వర్గాల విశ్వాసాన్ని వమ్ము చేశారు. విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్ర ప్రభుత్వం, దిశా లేకుండా నడుస్తున్న ఓ గుడ్డి నౌకలా మారింది. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టే విధంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది, అని తీవ్రంగా విమర్శించారు. ప్రదీప్ రావు మరోసారి ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. విద్యార్థులు సమాజంలో మార్పుకు మూలస్తంభాలు. వారి సమస్యలను విస్మరించడం అనేది రాష్ట్ర అభివృద్ధిని వెనక్కి నెట్టే చర్య. పెండింగ్‌లో ఉన్న అన్ని బీఏఎస్ స్కాలర్‌షిప్‌లను తక్షణం విడుదల చేయాలి. లేని పక్షంలో బీజేపీ విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ముమ్మరం చేస్తుంది అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు, విద్యార్థుల యొక్క తల్లితండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నినాదాలతో కలెక్టరేట్ పరిసరాలు మారుమోగాయి.

# ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 8 : ( సమయం న్యూస్ )**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల విధులను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అమలు, ఎన్నికల ప్రక్రియ నిర్వహణ వంటి అంశాలపై ఆయన అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి తన బాధ్యతను కట్టుదిట్టంగా, సమన్వయంతో నిర్వర్తించాలని సూచించారు. ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎంసీసీ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, వాటి ఉల్లంఘనకు పాల్పడిన వారిపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సెన్సిటివ్ మరియు హైపర్ సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించి సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. మండల కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు వంటి ప్రక్రియలపై సంబంధిత సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓలు) కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి అభ్యర్థులు తమ నామినేషన్ ఫారాలను ముందుగానే తనిఖీ చేసుకునే సౌకర్యం కల్పించాలని సూచించారు. రిటర్నింగ్ ఆఫీసర్లు స్వీకరించిన నామినేషన్లను అదే రోజు టి బి పో ల్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, ప్రతి రోజు సాయంత్రం నాటికి రోజువారీ నివేదికలు సమర్పిం చాలని ఆయన



ఆదేశించారు. తహసీల్దార్లు ఎస్ ఎస్ టి , ఎఫ్ ఎస్ టి బృందాల నివేదికలను సేకరించి జిల్లా నోడల్ అధికారులకు పంపాలని సూచించారు. జడ్పిటిసి నామినేషన్ల ప్రక్రియ సంబంధిత ఆర్ డి ఓ , సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగుతుందని తెలిపారు. తుది అభ్యర్థుల జాబితా ప్రకటించిన తర్వాత బ్యాలెట్ పేపర్ తయారీ , ముద్రణను తెలుగు వర్ణమాల క్రమంలో ఖచ్చితత్వంతో నిర్వహించాలన్నారు. పోలింగ్ సామాగ్రిని కేంద్రాల వారీగా వేరు చేసి భద్రంగా ఉంచాలని ఎంపీడీఓలను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ర్యాలీలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్ల వినియోగానికి సంబంధించి ఎస్ హెచ్ ఓ , సీఐ ల నుండి అనుమతులు తప్పనిసరిగా పొందాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి అక్టోబర్ 11వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు జరగనుంది. అక్టోబర్ 12న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 13న అప్పీల్ స్వీకరణ, అక్టోబర్ 14న అప్పీల్ విచారణ జరగనున్నట్లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు అక్టోబర్ 15వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఉండగా, అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారని వివరించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, చట్టబద్ధంగా, సమన్వయంతో నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నోడల్ అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాయపోల్‌లో మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి.

- సంక్షేమ పథకాలతో
- మహిళలకు ఆర్థిక శక్తి కల్పించాలి.
- అడిషనల్ డీఆర్డీఓ సుధీర్.



**రాయపోల్, అక్టోబర్ 8:** రాయపోల్ మండల మహిళా సమాఖ్య%-ల సమీక్ష సమావేశం బుదవారం మండల కేంద్రం రాయపోల్ లోని ఐకేపి మహిళా సమైక్య భవనం లో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అదనపు డీఆర్డీఓ సుధీర్ ముఖ్య అతిథి గా హాజరై కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రధాన భాగస్వాములుగా మారాలని సూచించారు. ప్రతి మహిళా సంఘం బలోపేతం కావడం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అవసరమైన వారికి స్వయం ద్వారా ఉపాధి కల్పించాల్సిన అవసరముందని, పీఎంఫ్ఈ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, నాటు కోళ్ల పెంపకం వంటి కార్యక్రమాలను మహిళా సంఘాల ద్వారా విస్తృతంగా చేపట్టాలని ఆయన సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధిస్తే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం యాదగిరి, సీసీలు కుమార్, అంజమ్మ, అకౌంటెంట్ రేఖ, అలాగే వివోఎ లు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ పాఠశాలల క్రీడలు ప్రారంభం



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 8 :( సమయం న్యూస్ )** స్థానిక ప్రకాశం మైదానంలో 69 వ ఎస్ జి ఎఫ్ జిల్లా స్థాయి క్రీడలను బుధవారం భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ గెలుపోటములు సహజమని విజేతలైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, అదేవిధంగా ప్రతి క్రీడాకారుడు క్రీడల ద్వారానే బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏ విధమైన సహాయానికైనా డివైఎస్ఓ ద్వారా తనను సంప్రదించాలని సూచించారు. ప్రసంగించి నేడు రేపు నిర్వహించబడే పోటీలలో భాగంగా తొలి రోజు 17 సంవత్సరాల విభాగంలోని బాలబాలికలకు అదేవిధంగా రేపు గురువారం 14 సంవత్సరాలలోపు బాల బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో , అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, తరువాత ఉమ్మడి జిల్లా జట్టుతో కలిపి రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని ఎస్ జి ఎఫ్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్ కుమార్ తెలియజేశారు ఈ పోటీలలో డి వై ఎస్ ఓ పరంధామ రెడ్డి, డిసి సి బి సెక్రెటరీ నీరజ , సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులైన ప్రేమ్ కుమార్, యనమదల వేణుగోపాల్, యుగంధర్, స్టెల్లా, కవిత, వీరన్న, కృష్ణ, పామర్తి శ్రీనివాస్ అంపైర్లు గా వ్యవహరించారు.

## హెవీ డ్రైవర్ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి

- సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



**పటాన్ చెరు(గుమ్మడిదల), అక్టోబర్ 8 (సమయం న్యూస్):** గుమ్మడిదల హెవీ డ్రైవర్ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీజర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీలోని సిజిఆర్ కార్యాలయంలో గుమ్మడిదల మండల హెవీ డ్రైవర్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు తమ సమస్యలను గోవర్ధన్ రెడ్డికి వివరించారు. సభ్యుల అభ్యర్థనలను శ్రద్ధగా విన్న గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, హెవీ డ్రైవర్ యూనియన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డ్రైవర్లకు భద్రతా రక్షణగా ఇన్సూరెన్స్ సదు-పాయం కల్పించేందుకు సిజిఆర్ ట్రస్ట్ తరఫున సహాయం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బక్క సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పి. యాదగిరి, సెక్రటరీ శంకర్ యాదవ్, కోశాధికారి నీరుడి ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల,ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఇతర ప్రాంతానికి తరలించొద్దని

- కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ ఆఫీసర్ ను కలిసి మెమోరాండం ఇస్తున్న ఉపాధ్యాయు బృందం



**కొడంగల్ మున్సిపాలిటీ (మం)అక్టోబర్,08(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని అప్పైపల్లిలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కళాశాల మరియు పాత కోడంగల్ లో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల సముదాయాలను ఇతర ప్రాంతానికి తరలిస్తున్నారని వార్తల నేపథ్యంలో కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ ఆఫీసర్ ను కలిసి కళాశాలను ఇక్కడి నుంచి తరలించవద్దని కొడంగల్ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో మెమొరండం ఇస్తున్న బృందం. సమాచారాన్ని ముఖ్యమంత్రి గారికి చేరవేస్తామని ప్రత్యేక అధికారి తెలిపారు

# ఎన్నికల విధులు నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, , అక్టోబర్ 8 : ( సమయం న్యూస్ ) :** ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్ మధిర నియోజకవర్గంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి బుధవారం పర్యటించారు. మధిర మండలం పరిధి లోని 175 మంది స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మధిర పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ కళ్యాణ వేదిక నందు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ట్రైనింగ్ కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగహన కల్పిస్తూ ఎన్నికల విధుల పట్ల కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ప్రతి అధికారి కొత్తగా ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు భావించి జాగ్రత్తగా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించడానికి వీలు లేదని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఈవిఎం యంత్రాలతో జరిగితే, స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ ద్వారా జరుగనున్నాయి అని, ప్రతి చిన్న అంశాన్ని, అనుమానాలను శిక్షణలో పూర్తి స్థాయిలో విచారించి తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. ట్రైనింగ్ హాల్ నుంచి సంపూర్ణ అవగాహన తో బయటకు పోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలంటే మనకు నిబంధనలపై సంపూర్ణ పట్టు ఉండాలన్నారు. రిసెప్షన్ కేంద్రంలో పోలింగ్ సామాగ్రి తీసుకున్న దగ్గర నుంచి మళ్లీ అప్పగించే వరకు పూర్తి బాధ్యత పోలింగ్ సిబ్బందిపై ఉంటుందని అన్నారు. రిజర్వ్ ఉన్న అధికారులు కూడా రిపోర్ట్ చేయాలని అన్నారు. శిక్షణకు రాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో మనం చేసే ప్రతి పని నిబంధనల ప్రకారం జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర తహసీల్దారు రాంబాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్తంభాద్రి పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ ప్రారంభించిన సీపీ



**ఖమ్మం , అక్టోబర్ 8 : ( సమయం న్యూస్ ) :** పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కొణిజర్ల పోలీస్ స్టేషన్ ప్రక్కన ఏర్పాటు చేసిన హెచ్ పి సి యల్ పెట్రోల్ బంకును బుధవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ద్వారా నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే కాకుండా దీనిపై వచ్చే ఆదాయాన్ని పోలీసు సిబ్బంది సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని అన్నారు. పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నాణ్యతా ప్రమాణాలను పాటించే పోలీస్ పెట్రోల్ బంక్ కు మంచి గుర్తింపు వస్తుందని ఆకాంక్షించారు. వినియోగదారులు తప్పకుండా పోలీస్ పెట్రోల్ బంక్ ను సందర్శించి పోలీస్ సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా హెచ్ పి పే యాప్ ద్వారా నగదు చెల్లింపులు జరిపితే డిస్కౌంట్ సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం, ఎస్బి ఏసీపీ మహేష్, ఏ ఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, నఫ్సాద్ .టి.ఎన్. (వరంగల్ టి ఓ హెచ్పిసిఎల్ చీఫ్ రీజినల్ మేనేజర్) సమ్మయ్య. (సేల్స్ ఆఫీసర్) సంకేత్ (ఇంజనీరింగ్ ఆఫీసర్)బి. రాహుల్(ఇంజనీరింగ్ ఆఫీసర్) సిఐ సాగర్,, అర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, నాగుల్ మీరా, కొణిజర్ల ఎస్సై సూరజ్ పాల్గొన్నారు.

## రుద్రారం గ్రామంలో పత్తి పంటపై నానో యూరియా పిచికారీ





- పలు గ్రామాల పత్తి పొలాలను
- సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించిన -ఏ ఓ తులసి

**కొడంగల్ మండలం, అక్టోబర్,08(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామ రైతు బొందెపల్లి కిష్టప్ప ( హన్మప్ప) పొలంలో పత్తి పంటపై ఇటీవల కురిసిన వర్షాల ప్రభావం నుంచి పంటను కోలుకోవడానికి నానో యూరియా పిచికారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి తులసి రుద్రారం మరియు అంగడి రాయిచూర్ గ్రామాల పత్తి పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. ఆమెతో పాటు ఎ.ఈ.ఓలు శ్రీపతి రెడ్డి, పావని పాల్గొన్నారు. అధికారులు రైతులకు నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నానో యూరియా యొక్క ప్రధాన ప్రయోజనాలు:తక్కువ మోతాదులో ఎక్కువ పోషక ప్రభావం కల్పిస్తుంది ు ఒక 500 మి.లీ బాటిల్ 1 ఎకరాకు సరిపోతుంది .పంటలలో నత్రజని శోషణ శాతం 80% వరకు పెరుగుతుంది. నేలలో రసాయన యూరియా వాడకం తగ్గిపోవడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది. పంటలు ఆకులు, కొమ్మలు బలంగా పెరిగి దిగుబడి మెరుగుపడుతుంది. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుంది మరియు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తుంది. నానో యూరియా వాడకం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో మెరుగైన దిగుబడిని పొందవచ్చని అధికారులు సూచించారు.

## న్యూలాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల భవనం ప్రారంభం, నీటి ట్యాంక్ భూమి పూజ



**పటాన్ చేరు(గుమ్మడిదల), అక్టోబర్ 8 (సమయం న్యూస్):** న్యూలాండ్ ఫౌండేషన్ పరిశ్రమ వారి ఆర్థిక సహకారంతో గుమ్మడిదల మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మితమైన ప్రాథమిక పాఠశాల భవన ప్రారంభోత్సవం, కొత్త మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా న్యూలాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ విద్యా అభివృద్ధి, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు తమ సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. పాఠశాల భవన ప్రారంభంతో విద్యార్థులకు మెరుగైన వాతావరణం లభిస్తుందని, అలాగే కొత్త నీటి ట్యాంక్ నిర్మాణం ద్వారా గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యూలాండ్ పరిశ్రమ ప్రతినిధులు డి.వి.రెడ్డి, కృష్ణమోహన్, సి.హెచ్. రవి, శ్రీహర్ష, సిఎస్ఆర్ లీడ్ యాదగిరి పాల్గొని పాఠశాల, నీటి ట్యాంక్ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను వివరించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినోద్, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని న్యూలాండ్ ఫౌండేషన్ పరిశ్రమకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజహిత కార్యక్రమాలు చేపడుతున్నందుకు న్యూలాండ్ యాజమాన్యానికి గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

# పారిశుద్ధ్య సిబ్బందికి జీతాల్లేక ఇబ్బంది

**పటాన్ చెరు,జిన్నారం, అక్టోబర్ 8 (సమయం న్యూస్):** జిన్నారం మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదు నెలలుగా జీతాలు అందకపోవడంతో వారి జీవనం పూర్తిగా దెబ్బతిన్నదని వారు వాపోతున్నారు. రోజూ తెల్లవారుజామున నుంచి కష్టపడి ప్రజలకు పరిశుభ్రతను అందిస్తున్నప్పటికీ, తమకు జీతం రావడంలేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. పండుగల వేళ జీతం లేక కుటుంబ సభ్యుల అవసరాలను తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. “మేము కూడా కుటుంబాలు ఉన్న మనుషులమే. పిల్లల చదువు, ఇళ్ల అద్దె, రేషన్ ఖర్చులు అన్నీ పెరుగుతున్నాయి. ఐదు నెలలుగా జీతం లేక మేము అప్పుల పాలవుతున్నాం,” అని ఒక పారిశుద్ధ్య కార్మికుడు కన్నీటి స్వరంలో చెప్పారు. ప్రతిరోజూ చెత్త సేకరణ, కాలువలు శుభ్రం, మురుగునీటి తొలగింపు వంటి పనులు చేస్తున్నాము. కానీ మాకు సరైన వేతనం ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు ఈ విషయంపై స్పందించాలని, వెంటనే పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే తమ సమస్య పరిష్కారం కోసం సమూహంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషించే ఈ సిబ్బందికి ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కూడా కోరుతున్నారు.




## మైత్రి ఫౌండేషన్ సేవలకు గుర్తింపు

**- నీలోఫర్ ఆసుపత్రి నుంచి ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం**



**పటాన్ చెరు, గుమ్మడిదల, అక్టోబర్ 8,(సమయం న్యూస్):**గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మైత్రి ఫౌండేషన్ సేవలకు గుర్తింపు లభించింది. నీలోఫర్ ఆసుపత్రిలో తలసేమియా పిల్లలు, గర్భిణీ స్త్రీల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు ఆసుపత్రి సిఎస్ నాగజ్యోతి, సూపరిండెంట్ విజయ్ కుమార్‌లు ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయకుమార్‌కు ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు.ఈ సందర్భంగా ఉదయకుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు తమ సేవలకు లభించిన గౌరవమని, మాపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పటాన్ చెరు,జిన్నారం, అక్టోబర్ 8 (సమయం న్యూస్):**132 కేవీ గుమ్మడిదల సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్న అత్యవసర మరమ్మతు పనుల కారణంగా గురువారం జిన్నారం మండలం, గుమ్మడిదల మండల పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుంది.ఈ కారణంగా ఇండస్ట్రియల్ ఫీడర్లకు సహా ఆయా గ్రామాలకు ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని గుమ్మడిదల ఏడి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మరమ్మతు పనులు సజావుగా సాగేందుకు వినియోగదారులు, పారిశ్రామిక వేత్తలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బొంతపల్లి ఏఈ రవీందర్, జిన్నారం ఏఈ వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు.

## వానకాలం పంటలు పత్తి, కంది,వరి,ఇతర పంటలు ఆన్లైన్లో నమోదు చేయడం జరిగింది- ఏ ఇ ఓ తిరుపతి



**గుండుమాల్ మండలం, అక్టోబర్,08(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని గుండుమాల్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామంలో వానకాలం పంటలు( పత్తి , కంది , వరి) ఇతర పంటలు ( ఆన్లైన్ ) లో నమోదు చేయడం జరిగింది.కావున ప్రతి ఒక్క రైతు మీ వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర పంటల వివరాలు నమోదు చేయించుకోగలరు , చేయించుకొని యెడల పంట కొనుగోలు సమయంలో ఇబ్బందులు పడతారు, అలాగే పంట మద్దతు ధర లభించదని ఎ ఇ ఓ తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ సత్తయ్య, మరియు గ్రామ రైతులు రవి, సాయిలు, హన్మప్ప తదితరులు ఉన్నారు.

## పదోతరగతి పరీక్షల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించాలి.



**- జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి.**

**రాయపోల్,అక్టోబర్ 8:** పదోతరగతి పరీక్షల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించి విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బుదవారం రాయపోల్ మండలంలోని బేగంపేట పాఠశాల సముదాయంలో ఉన్న ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి తరగతిలో విద్యార్థుల చదవడం,రాయడం, మధ్యాహ్న భోజన పథకం అమలు,ప్రతి సబ్జెక్టులో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.కొంతమంది విద్యార్థులకు డిక్టేషన్ నిర్వహించి వారి ప్రావీణ్యతను అంచనా వేశారు. ప్రతి విద్యార్థి చదవడం,రాయడం వచ్చేటట్లు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని ఆయన సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనం మెనూను నిర్ణీత ప్రణాళిక ప్రకారం పాటించాలని ఆదేశించారు.పదవ తరగతి విద్యార్థులు ఈసారి కనీసం 90 శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ఇప్పటినుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకుని తరగతి వారీగా స్లిప్ టెస్టులు నిర్వహించాలని, పరీక్షలపై ఉన్న భయం తొలగించే విధంగా మార్గదర్శనం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సత్యనారాయణ రెడ్డీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, సీఆర్పీలు యాదగిరి,స్వామి, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు,కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సమావేశం





**మద్దూరు మున్సిపాలిటీ(మండలం అక్టోబర్,08,(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలోని షా గార్డెన్ ఫంక్షన్ హాల్ లో మద్దూర్, కొత్తపల్లి మండలాల స్థానిక సంస్థల ఎన్నికలపై మండల ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన మాజీ ఏమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి,స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీ అని మాజీ ఎమ్మెల్యే అన్నారు.నియోజకవర్గ ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలకు మోసపోయారు మళ్ళీ ఆ తప్పు చేసి తిప్పలు పాడరు అని అన్నారు. బాకీ కార్డును ఇంటింటికి చేర్చాలి..కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

## అల్ట్రా సౌండ్ యంత్రం స్వాధీనం



**ఖమ్మం, అక్టోబర్ 8 : ( సమయం న్యూస్ ) :** ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పి.సి. పి.ఎన్.డి.టి. చట్టం- 1994 ప్రకారం అనధికారికంగా ఉపయోగిస్తున్న పోర్టబుల్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి ఒక ప్రకటనలో తెలిపారు.డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ చందు నాయక్, ఖమ్మం అర్బన్ పోలీస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని, తనిఖీ సమయంలో హిటాచీ మోడల్ ఈ యు బి బి -405 ప్లస్ పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రం, ఒక ప్రోబ్, రెండు అల్ట్రాసౌండ్ జెల్ సీసాలను సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ యంత్రాలు నిర్దిష్ట అధికార రిజిస్ట్రేషన్ లేకుండా పనిచేస్తున్నట్లు గుర్తించామని, ఇందులో సల్లోజా వెంకటేష్ (వయసు 30, పాండురంగపురం, ఖమ్మం రూరల్), బానోత్ హుస్సేన్ (వయసు 40, వైఎస్సార్ కాలనీ, ఖమ్మం అర్బన్) సంఘటన స్థలంలో ఉన్నారని అన్నారు. తక్షణమే పంచనామా నిర్వహించి, అధికారిక ఫిర్యాదు ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ లో పి.సి.పి.ఎన్.డి.టి. ఇతర సంబంధిత చట్టాల ఆధారంగా కేసు నమోదు చేయడం జరిగిందని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రైల్వే మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో మహబూబాబాద్ లో ఏర్పాటుకు

**ఎంపీ బలరాం నాయకు కృషి.**

**మహబూబాద్ అక్టోబర్ 08( సమయం న్యూస్,). :** దేశం వ్యాప్తంగా రైలు ప్రయాణానికి గణనీయంగా పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో, కోచింగ్ మరియు ఫ్రైట్ ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిన కేంద్ర రైల్వే శాఖ వరంగల్ - మహబూబాబాద్ మధ్యలో మేఘా ఫ్రైట్ నిర్వహణ స్థాపనకు నిర్ణయం తీసుకుంది.ఈ విభిన్న అభివృద్ధి కార్యక్రమాలు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ గారి నిరంతర ప్రయత్నాలు, దౌత్యం మరియు సమర్థ ప్రతినిధిత్వం వల్లనే సాధ్యమయ్యాయి.

## స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు

**ఖమ్మం, అక్టోబర్ 8 : ( సమయం న్యూస్ ) :** ఎన్నికల నియామవళి అనుసరించిస్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు, పకడ్భందీ బందోబస్తు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, మధిర పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తల్లాడ మండలం రెడ్డిగూడెం లోని జ్యోతి జూనియర్ కాలేజ్ లలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ ల ఏర్పాట్లను బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి పరిశీలించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు కలెక్టర్ సూచించారు.మొదటి విడతలో నిర్వహించే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్స్ లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు, రిసెప్షన్ కౌంటర్స్ నిర్వాహణ, కౌంటింగ్ హాల్ లోపల జాలీతో పెన్సింగ్, ఎలక్షన్ సిబ్బందికి, మంచినీటి, భోజన వసతులు, బ్యాలెట్ బాక్సులు తీసుకువచ్చే బస్సుల ట్రాఫిక్ నియంత్రణ, స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు పకడ్బందీగా నియమించాలని, పోలీసు కంట్రోల్ ద్వారా నిరంతర సీసీ కెమెరా పర్యవేక్షణ, మీడియా సెంటర్, వర్షం వలన ఏలాంటి జల్లు రాకుండా మరమ్మత్తులు, సరిపడా వసతులు సమకూర్చాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బోనకల్, మధిర, ఎర్రుపాలెం మూడు మండలాలు, సత్తుపల్లి మధర్ థెరీసా ఇంజనీరింగ్ కళాశాల నందు పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మూడు మండలాలు, రెడ్డిగూడెం క్రీస్తు జ్యోతి జూనియర్ కళాశాల నందు ఏన్కూర్, తల్లాడ, కల్లూరు మూడు మండలాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో కల్లూర్ డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, అదనపు డిసిపి ప్రసాద రావు, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్లు కరుణాకర్ రెడ్డి, రాంప్రసాద్, ఎంపీడీవోలు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై దాడి హేయం..!

- న్యాయవ్యవస్థ బతికి ఉండాలంటే ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి
- ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిరసన





**పరిగి మున్సిపాలిటీ (మండలం)అక్టోబర్ 08,(సమయం న్యూస్):** దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై ఓ న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన ఘటన అత్యంత ఆందోళన కరమైన, హేయమైన చర్య అని మంచన్పల్లి ఆనంద్ అన్నారు.

పరిగి పట్టణంలో బుధవారం వివిధ ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మంచన్పల్లి ఆనంద్ అధ్యక్షతన నిరసన తెలుపుతూ జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడిని ఖండించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ అంతిగారి సురేందర్ తోపాటు ప్రజ సంఘాల నాయకులు సామాజిక కార్యకర్త దేవనోనిగూడెం వేంకటన్న, సిపిఎం వెంకటయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎరన్ పల్లి శ్రీనివాస్, జేఏసీ ఛైర్మన్ ముకుంద నాగేశ్వర్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద నాయక్ లు, స్వేరోస్ సలహాదరులు వినోద్, సిపిఎం రామకృష్ణ, నరేష్ మాట్లాడుతూ భారతదేశ అత్యున్నత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై దాడి చేసిన వ్యక్తికి కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థ బతికి ఉండాలంటే ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలని అదేవిధంగా భారత రాజ్యాంగాన్ని కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్ జిల్లా అధ్యక్షులు రాజేష్, రఘువీర్, ఎమ్మార్పీఎస్ దోమ మండల అధ్యక్షులు వెంకటేష్, మక్తల సింగం, వినోద్, దళిత బహుజన శ్రామిక యూనియన్ నాయకులు నర్సింలు, అంబేద్కర్ సంఘాల నాయకులు పవన్, యాది రామ్, ప్రసాద్, రాజు, గిరి, మలేష్, యే-సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐలవ్ అంబేడ్కర్ కార్యక్రమాన్ని బుధవారం కొడంగల్ లో నిర్వహించారు.

### జాతీయ యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజు ఆధ్వర్యంలో






**కొడంగల్ మున్సిపాలిటీ (మం)(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని గాంధీనగర్ కాలనీ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ వాదులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో కృష్ణంరాజు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలు, సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై చెప్పులు విసరడం లాంటి సంఘటనలను చూస్తుంటే దేశంలో మోదీ ప్రధాన మంత్రి అయినా దళితులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. దేశంలో అత్యాచారాలు, దాడు లు, చిత్రహింసలు పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురారివషిష్ట, శంకర్ నాయక్, సయ్యద్ అంజద్ అశోక్, కస్తూర్పలి అశోక్, అశోక్ గౌడ్, చిన్నయ్య, రమేశ్, అశోక్, ఖుషీ, ఎస్ఎం. గౌసన్. మొగులప్ప, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలులో జిల్లాను ఆదర్శంగా నిలుపాలి

## అవగాహన సదస్సులో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి




**నిజామాబాద్, అక్టోబర్ 08( సమయం న్యూస్)** పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఉద్దేశించిన సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ శాఖలలో సమ-ర్థవంతంగా అమలు చేస్తూ నిజామాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలుపాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఆర్.టి.ఐ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓల నేతృత్వంలో గురువారం నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ లలో డివిజనల్ స్థాయిలో, శుక్రవారం తహసిల్దార్ల ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో మండల స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాలకు ఆయా శాఖల పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓలు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఆర్.టి.ఐ చట్టంలోని నిబంధనలను చక్కగా ఆకళింపు చేసుకుని, పక్కాగా అమలు అయ్యేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి(పీ.ఐ.ఓ), సహాయ పౌర సమాచార అధికారి (ఏ.పీ.ఐ.ఓ), అప్పిలేట్ అధికారి వివరాలతో కూడిన సమాచార హక్కు చట్టం బోర్డును విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అధికారులు మారిన సందర్భాలలో వెంటదివెంట ఆ సమాచారాన్ని అప్డేట్ చేయాలని అన్నారు. అదేవిధంగా ఆర్.టి.ఐ అమలుకు సంబంధించి తప్పనిసరిగా రిజిస్టర్ ను నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు వివరాలను అందులో పొందుపరచాలని సూచించారు. 4(1బి) రిజిస్టర్లోని సమాచారంతో కూడిన బుక్ లెట్ ను అన్ని కార్యాలయాలలో అందుబాటులో ఉంచాలని, పీరియాడికల్ రిపోర్ట్స్ ను క్రమం తప్పకుండా సేకరించాలని, కనీసం ప్రతి మూడు మాసాలకు ఒకసారి ఆర్.టి.ఐ అమలుపై సమీక్ష జరపాలని అన్నారు. పై అంశాలను పాటిస్తున్నారా, లేదా అన్నది నిశితంగా పర్యవేక్షణ జరుపుతామని కలెక్టర్ తెలిపారు. సమాచార హక్కు చట్టంలోని నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధి లోపు పరిష్కరించాలని అన్నారు. దరఖాస్తుదారు రెండవ అప్పిలేట్ అథారిటీకి వెళ్లే ఆస్కారం లేకుండా కోరిన సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్ లో అందించాలని, సమాచారం అందించే సమయంలో విచక్షణతో వ్యవహరిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్.టి.ఐ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావిస్తూ, అనవసర కాలయాపన చేస్తే జరిమానాలకు గురి కావాల్సి వస్తుందని, ఇది పదోన్నతులు, ఇంక్రిమెంట్లు వంటి వాటిపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆర్.టి.ఐ అమలులో నిర్లిప్త ధోరణికి అవకాశం లేకుండా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని హితవు పలికారు. దరఖాస్తుదారు కోరిన విధంగా నిర్ణీత వ్యవధిలో పారదర్శకంగా ఖచ్చితమైన సమాచారాన్ని యధాతథంగా అందించాలని అన్నారు. సమాచారం ఇవ్వడానికి తిరస్కరిస్తే అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అవగాహన సదస్సులలో పాల్గొని, ఆర్.టి.ఐ చట్టం గురించి ఆకళింపు చేసుకుని, అన్ని కార్యాలయాలలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు. కాగా, రిసోర్స్ పర్సన్లు కిషన్, కృష్ణాజీ సమాచార హక్కు చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆర్.టి.ఐ అమలు విషయంలో సాధారణం గా జరిగే పొరపాట్లు ఏమిటీ, వాటిని ఎలా నియంత్రిం చుకోవాలి, దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని అందించే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాల గురించి తెలియజేశారు. జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ అన్ని శాఖల జిల్లా అధికారులు, పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓలు తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ ఉన్నత పాఠశాల బోధన కార్యక్రమాన్ని పరిశీలించినా జిల్లా కలెక్టర్



**కరీం నగర్ రూరల్ అక్టోబర్,08( సమయం న్యూస్). :** కరీంనగర్ రూరల్ మండలం నగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "బుధవారం బోధన" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. బుధవారం బోధనలో భాగంగా విద్యార్థులు ఆంగ్ల పాఠం నేర్చుకుంటుండగా ప్రతి విద్యార్థితో పాఠాన్ని చదివించారు. చదవడంలో మెళకువలు నేర్పారు. అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, విటమిన్ గార్డెన్, గ్రంథాలయాన్ని పరిశీలించారు.

# ఏ టి సి లో శిక్షణ తో విద్యార్థుల భవిష్యతుకు బాట

- విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్స్ తో పాటు అత్యాధునిక సాంకేతిక శిక్షణ నందించాలి:జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్ అక్టోబర్08( సమయం న్యూస్) :** ఏ..టి.సి.లో శిక్షణ పొందుతున్న విద్యార్థిని,విద్యార్థులకుథియరీ, ప్రాక్టికల్ క్లాసులు ఆధునిక యంత్రాలతో సమగ్రంగా నిర్వహించాలని, విద్యార్థులకు తాజా సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. ప్రభుత్వ ఐ.టి.ఐ. (బాలుర) మరియు (బాలికల) ఆవరణలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తో కలిసి బుధవారం సందర్శించారు. ఏ.టి.సి లో ఆధునిక సాంకేతిక శిక్షణ కోర్సుల గురించి కలెక్టర్ కు ప్రిన్సిపాల్ వివరించారు. ప్రిన్సిపల్స్, బోధనా సిబ్బందికి కలెక్టర్ సూచనలు చేశారు. ఏ.టి.సి లో అందిస్తున్న కోర్సులు దేశీయంగా మాత్రమే కాకుండా విదేశాలలో కూడా అత్యుత్తమ ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులని,అందువల్ల విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు అందించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. తొలుత జిల్లా కేంద్రం లో ని బస్టాండ్ సమీపంలోనిబాదం రామస్వామి % సరోజా దేవి మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియం, మున్సిపాలిటీలో కళా భారతి, భవనాలను కలెక్టర్ పరిశీలించారు.బాదం రామస్వామి % సరోజా దేవి మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియం ను పరిశీలించి కావలసిన రిపేర్ ల గురించి తెలుసుకుని సూచనలు చేశారు. కళా భారతి నిర్మాణం ను పరిశీలించి నిర్మాణ ప్రగతి గురించి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమాల్లో బాలుర ఐ.టి.ఐ ప్రిన్సిపల్ శ్రీ బి. శాంతయ్య, బాలికల ఐ.టి.ఐ ప్రిన్సిపల్ ఎస్. గోపాల్ నాయక్, ఐ.టి.ఐ / ఏ.టి.సి బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# మీడియా సెంటర్ (ఎంసిఎంసి) ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

### ఎన్నికల వార్తలపై నిఘా పెట్టాలని సూచనలు.



**నిర్మల్ అక్టోబర్08( సమయం న్యూస్) :** స్థానిక సంస్థల ఎన్నికలలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, మీడియా మానిటరింగ్ సర్టిఫికేషన్ కమిటీ (ఎంసిఎంసి)ని జిల్లా కలెక్టర్ భిలాష అభినవ్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు.

జిల్లా కలెక్టరేట్లోని సమాచార శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన కలెక్టర్, అనంతరం అధికారులతో మాట్లాడుతూ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి వార్తపై నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా వచ్చే వార్తలు లేదా ప్రచారాలు ఏవైనా గమనించిన వెంటనే వాటి వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని, వాస్తవాధారిత వార్తల ప్రచారంతో ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, అపోహలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీపీఆర్వో విష్ణువర్ధన్, డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

09-10-25 Samayam_Layout 1 10/9/2025 5:08 AM Page 10



# హైస్కూల్ లో ఆస్ట్రో ల్యాబ్ ను సందరిచ్చిన జిల్లా కలెక్టర్

**మహబూబ్ నగర్ అక్టోబర్08( సమయం న్యూస్).** :ల్లా కేంద్రంలోమోడల్ బేసిక్ హైస్కూల్ లో ఆస్ట్రో ల్యాబ్ ను బుధవారంజిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ లు సందర్శించారుడిల్లీ నుంచి వచ్చిన ఆస్ట్రో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు మిశ్రా కలేక్టర్ కు ఈ లాబ్ లో ఉన్న టెలిస్కోప్, 42 రకాల ప్రయోగాలు, నక్షత్ర శాల , గ్రహాల గురించి ఏ విధంగా ఈ లాబ్ ను ఉయోగించవచ్చు అనే విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలోజిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్,
%సూమీ% దుంకుడు శ్రీనివాస్ , సుధాకర్ రెడ్డి బాసిత్ గారు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మొదటి ఫేజ్ లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఏరాట్లు

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ అక్టోబర్08( సమయం న్యూస్) :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.జిల్లాలో మొదటి ఫేజ్ లో 6 జడ్పీటీసీలు, 70 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఆర్ఓ, ఏఆర్ఓలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, నోడల్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. ఈ సమావేశంలోఅదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జెడ్పీ సిఈఓ శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య తో పాటు నాణ్యమైన వసతులు కల్పించాలి.




●అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.

**నిర్మల్ అక్టోబర్ 08( సమయం న్యూస్) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్యను అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు, నాణ్యమైన వసతులు కల్పించాలన్నారు. మండలాల వారిగా ప్రభుత్వ కళాశాలలు, విద్యార్థులు, అధ్యాపకుల సంఖ్య, తదితర అంశాలను సమీక్షించారు. ప్రతీ రోజు కళాశాలలకు విద్యార్థులు, అధ్యాపకులు వంద శాతం హాజరయ్యేలా చూడాలన్నారు. తరగతులకు హాజరు కాని విద్యార్థులను గుర్తించి, విద్యార్థులు ఎవరూ కాలేజీ మానేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులందరికి తప్పకుండా ప్రాక్టికల్స్ నిర్వహించాలని తెలిపారు.
ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురాం, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపల్స్, తదితరులు పాల్గొన్నారు.

# ఆహార పరిశుభ్రత ను ద ఉల్లంఘించితే కఠిన చర్యలు

## హెూటళ్ల యజమానులను హెచ్చరించిన

## ఫుడ్ సేఫ్టీ అధికారి వినీల్ కుమార్




**జనగాం అక్టోబర్ 08( సమయం న్యూస్). :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆహార పరిరక్షణ విభాగం అధికారులు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో జనగామ పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్నటు వంటి వివిధ రకాల హెూటళ్ల పైన ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఆహార పరిశుభ్రతను ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు.
ఆహార పరిశుభ్రత ను ఉల్లంఘించితే కఠిన చర్యలు తీసుకుంటామని,హెూటళ్ల యజమానులను ఫుడ్ సేఫ్టీ అధికారి వినీల్ కుమార్ హెచ్చరించారు.హెూటళ్ల ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిర్వహణ సిబ్బందికి క్యాప్స్, డ్రెస్ కోడ్ ఉండాలని, హ్యాండ్ బౌ ్లసేస్ వాడాలని సూచించారు.ఈ సందర్భంగా 12ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లు, హెూటల్ లను తనిఖీ చేసి 13వేల రూపాయలు జరిమానాలు విధించారు.ఈ తనిఖిలో జిల్లా ఆహార పరిరక్షణ అధికారి తో పాటు మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ పులి శేఖర్, సానిటరీ జవాన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాడి తప్పిన వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టాలి

● రైతు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి.



**హైదరాబాద్ అక్టోబర్08( సమయం న్యూస్) :** రైతు కమిషన్ కార్యాలయంలో వ్యవసాయ,ఉద్యాన వన, ఫారెస్ట్, నాబార్డు, శాస్త్రవేత్తలు, ఇతర శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించిన కమిషన్.కోతుల బెడద, నివారణ చర్యలు, సోలార్ ఫెన్సింగ్, సాయిల్ టెస్టింగ్ తోపాటు ఉద్యానవన పంటల పెంపుపై చర్చ.హాజరైన అగ్రికల్చర్, హార్టికల్చర్ డైరెక్టర్లు బి. గోపి, షేక్ యాస్మిన్ బాషా, ఉద్యానవన యూనివర్సిటీ వీసీ రాజీరెడ్డి, ఇతర శాఖల అధికారులు.
వ్యవసాయ రంగంలో ఏఐ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన జర్మనీ ప్రతినిధులుతెలంగాణ రాష్ట్రంలో గత పదేండ్లుగా వ్యవసాయ రంగం గాడి తప్పిందన్నారు రైతు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి. గాడి తప్పిన వ్యవసాయ రంగాన్ని సీయం రేవంత్ రెడ్డి గాడితో పెడ్తున్నారని తెలిపారు. వ్యవసాయ రంగం బలోపేతం చేయడానికి రైతు కమిషన్ అన్ని అంశాలపై ఫోకస్ పెట్టిందన్నారు. అందులో భాగంగానే ఈ రోజు కమిషన్ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన, ఫారెస్ట్, నాబార్డు, వ్యవసాయ శాస్త్రవేతలతో సమావేశం నిర్వహించినట్లుగా తెలిపారు. ప్రధానంగా ఈ సమావేశంలో రైతులు కోతుల బెడద వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు, నివారణ చర్యలు, సోలార్ ఫెన్సింగ్ తోపాటు సాయిల్ టెస్ట్.. ఆవశ్యకత పై సుధీర్ఘంగా చర్చించినట్లు వివరించారు. కోతుల బెడద, నివారణ కోసం చర్యలు చేపట్టాలని, అడవుల్లో కోతులకు సరైన ఆహారం దొర్కడం లేదని, ఫలితంగా కోతులు గ్రామాల్లోకి, పంట పోలాలపైకి వస్తున్నట్లు పేర్కొన్నారు. కోతుల బెడద నివారణ కోసం ఇతర రాష్ట్రాల్లో అవలంబిస్తున్న విధానాలపై అధికారులతో చర్చించారు. కోతుల బెడద పోతే రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెరుగుతోందన్నారు. పంట పొలాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ చేయాలంటే రైతులపై ఆర్థిక భారం పడ్తుందని.. అలా కాకుండా ఇతర నివారణ చర్యలపై ఫోకస్ పెట్టాలన్నారు. రాష్ట్రంలో యూరియా వినియోగం విపరీతంగా పెరిగిందని, భూ పరిక్షలు చేసిన తర్వాతనే పంటలు సాగుచేసేలా అధికారులు చర్చలు చేపట్టాలని సూచించారు. అధిక మోతాదుల్లో యూరియా వాడకం వల్ల గాలి, నీరు, వాతావరణం కలుషితం అవుతున్నాయని తెలిపారు. ఇక భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు రూపొందించిన సాయిల్ టెస్టింగ్ కిట్ డెమోను ఈ సమావేశంలో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు ప్రదర్శించారు. ఐఐఆర్ఆర్ రూపొందించిన సాయిల్ టెస్ట్ కిట్ ను రైతు కమిషన్ కొనుగోలు చేసి.. వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి గోపికి అందజేసింది. భూ సార పరిక్షా పరికరాలు రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టాలన్నారు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలోనే వ్యవసాయ రంగానికి లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. భవిష్యత్ లో వ్యవసాయ రంగంలో రావాల్సిన మార్పులు, అనుసరించాల్సిన విధానాలపై అధికారులతో చర్చించారు. వ్యవసాయ రంగానికి కేంద్రం నుండి వచ్చే నిధులు, నాబార్డు నిధుల వినియోగం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా జర్మనీ ప్రతినిధులు ఏసీఆర్ఏటీ సంస్థ వరి,పత్తి సాగులో ఏఐ టెక్నాలజీ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం వేముల వాడ నియోజక వర్గంలో మూడు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఏఐ టెక్నాలజీ ఇంప్లిమెంటేషన్ చేస్తున్నట్లు జర్మనీ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీరెడ్డి, గడుగు గంగాధర్, చెవిటి వెంకన్నయాదవ్, రాములు నాయక్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ రాజీరెడ్డి, అటవీ శాఖ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు బ్రజేంద్ర, మానస, వ్యవసాయ శాఖ జేడీఏ సుచరిత, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ శాస్త్రవేత్త రామాంజనేయులు, జర్మనీ ఏసీఆర్ఏటీ సంస్థ ప్రతినిధులు రఘు చలిగంటి, సెబాస్టియన్ బోస్ తోపాటు వ్యవసాయ శాఖ అధికారులు హరి వెంకట ప్రసాద్, మహేష్, రజిత, శ్రావణి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలుతో పాలనలో కీలక మార్పులు

## 5 నుండి 12 వరకు వారోత్సవాలు


## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ అక్టోబర్08( సమయం న్యూస్):** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం సమాచార హక్కు చట్టం 2005లో అమల్లోకి వచ్చిందని, తద్వారా పాలనలో కీలక మార్పులు వచ్చాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సమాచార హక్కు చట్టం- 2005 అమల్లోకి వచ్చి ఇరవై సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో ఈ నెల 5 నుండి 12వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాల భాగంగా జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం-2005లోని అంశాలు, ఆర్టీఐ దరఖాస్తు విధానం, దరఖాస్తుల స్వీకరణ, దరఖాస్తు ఫీజు, దరఖాస్తుదారుకు ఇవ్వాల్సిన సమాచారం, పీఐవో, ఏపీఐవో ల బాధ్యతలు, తదితర అంశాలపై సమాచార హక్కు చట్టం విషయ నిపుణులు ధరమ్ సింగ్ అధికారులు, పీఐవో, ఏపీఐవోలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఈ చట్టం అమలు కాకముందు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు ఎలాంటి సమాచారం అందేది కాదని, కాని 2005 సంవత్సరంలో అమల్లోకి వచ్చిన సమాచార హక్కు చట్టంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పాలనలో పారదర్శకతను అమలు చేసేందుకు సమాచార హక్కు చట్టం కీలక మార్పులు తీసుకువచ్చిందన్నారు. ప్రజలకు జవాబుదారీతనం, పారదర్శకంగా పనిచేసేందుకు సమాచార హక్కు చట్టం దోహదపడుతుందన్నారు. సమాచార హక్కు చట్టంతో పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరే సమాచారాన్ని అందించడంలో పిఐవో, ఏపీవోల బాధ్యతలు కలిగి ఉంటారు కాబట్టి సమాచార హక్కు చట్టంపై పీఐవో, ఏపీఐవోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరిన సమాచారం అందించాలన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరిన సమాచారాన్ని అందజేయడంలో ఉత్తమ పనితీరుకుగాను హనుమకొండ జిల్లా కలెక్టరేట్ పీఐవో రాష్ట్ర స్థాయిలో నిలిచినందుకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. సమావేశం అనంతరం సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని జిల్లా అధికారులు, పిఐవోలు, ఏపీఐవోలతో జిల్లా కలెక్టర్ సమక్షంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. వి.గణేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వచ్చి ఇరవై ఏళ్లు పూర్తి కావొస్తుందని, సమాచార హక్కు చట్టంపై డివిజన్, మండల స్థాయిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లాస్థాయి అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల పీవోలు, ఏపీఐవోలు, అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రీవెన్స్ కమిటీ మెంబర్‌గా హైదరాబాద్ డీటీవో వసుంధర

హైదరాబాద్, అక్టోబర్ 7 (సమయం న్యూస్): జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ సోమవారం నుంచి అమలు లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ముఖ్య ఉద్దేశ్యం రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తున్న నగదు ఎఫ్ఎస్టీఎస్ఎస్టీ ఇతర పర్యవేక్షణ బృందాలు పోలీసులు, 50 వేల కంటే ఎక్కువ నగదు ను పట్టుకున్న సందర్భంగా ఆ వ్యక్తులు కారణాలు చూపిస్తూ తిరిగి సొమ్మును సరైన విధంగా నిరూపణ పత్రాలు ఈ కమిటీకి అందజేసిన పక్షంలో అట్టి సొమ్మును సంబంధిత వ్యక్తులు అందజేస్తారు. ఎన్నికల నేపథ్యంలో నగదు సీజ్ చేసిన అధికారి తిరిగి సొమ్ము కోసం ఈ కమిటీని సంప్రదించాలని సూచిస్తారు. అందుకోసం ఈ కమిటీ సభ్యురాలిగా ఉప సంచాలకులు హైదరాబార్ జిల్లా ట్రెజరీ అధికారి వసుందర ను ఎన్నికల నియమావళి ప్రకారంగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ నియమించారు. శ్రీమతి వసుందర తో పాటుగా జీహెచ్ఎంసీలో స్పోర్ట్స్, ఎస్టేట్ అడిషనల్ కమీషనర్ గా పని చేస్తున్న కి ఏ మంగతాయారు,ను చైర్మెన్‌గా అకౌంట్స్ ఎగ్జామినర్‌గా పని చేస్తున్న ఎన్నికల అకౌంట్ మానిటరింగ్ నోడల్ ఆఫీస్ గా వ్యవహరిస్తున్న వెంకటేశ్వర రెడ్డి మెంబర్‌గా జిల్లా ఎన్నికల అధికారిగా నియమించారు. ఈ కమిటీ వారం వారం సమావేశమై విచారణ నిర్ధారణ అయితేనే తిరిగి ఇస్తారు. లేని పక్షంలో ఇంతే సంగతులు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా కాకుండా జీహెచ్ఎంసీ పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తారు.ఎన్నికల నేపథ్యంలో ప్రజలు 50 వేల కంటే ఎక్కుంగ నగదు తీసుకుని పోకుండా ఒక వేళ అత్యవదేమైతే సరైన ప్రూఫ్ లను తీసుకొని పర్వాలేదు ఆ తర్వాత గ్రీవెన్స్ కమిటీ నిర్ణయం మేరకు తిరిగి చెల్లిస్తారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



# 12న 6 జిల్లాల్లో పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

**హైదరాబాద్ అక్టోబర్08( సమయం న్యూస్) :** మన రాష్ట్రంలో పోలియో చివరి కేసు 2007లో నమోదు అయింది. మన దేశంలో 2011లో చివరి కేసు నమోదు అయింది.గత 3 సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదు అవుతున్నాయిఈ నేపథ్యంలో.. ఆయా దేశాల నుంచి మనదేశానికి రాకపోకలు జరుగుతున్న జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి 5 జిల్లాలు (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ) ఉన్నాయి.ఈ ఐదు జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది.ఈ 6 జిల్లాల పరిధిలో 0-5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు.వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్‌లో పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు.అప్పుడే పుట్టిన శిశువుల దగ్గర్నుంచి, 5 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

09-10-25 Samayam_Layout 1 10/9/2025 5:08 AM Page 11



# జడేజా, సిరాజ్ అత్యుత్తమ ర్యాంకులు

## అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టెస్టు ర్యాంకింగ్స్ రిలీజ్

టీమ్ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, పేసర్ మహ్మద్ సిరాజ్ క్రికెట్ రాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ పొజిషన్ సాధించారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా రిలీజ్ చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో జడేజా, సిరాజ్ అత్యుత్తమ ర్యాంకులు సంపాదించారు. జడేజా రీసెంట్‌గా వెస్టిండీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో అదరగొట్టాడు. ఈ ఇన్నింగ్స్‌లో జడ్డూ 104 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఫలితంగా తాజా ర్యాంకింగ్స్‌లో ఆరు స్థానాలు ఎగబాకి కెరీర్‌లో ఆల్‌టైమ్ బెస్ట్ పొజిషన్‌కు చేరుకున్నాడు. ప్రస్తుతం జడ్డూ 644 రేటింగ్స్‌తో 25వ స్థానంలో కొనసాగుతున్నాడు. జడేజాకు టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్.మరోవైపు, కొంతకాలంగా టెస్టుల్లో నిలకడగా రాణిస్తున్న సిరాజ్ విండీస్‌తో తొలి మ్యాచ్‌లోనూ రెండు ఇన్నింగ్స్‌ల్లో 7 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. దీంతో సిరాజ్ మూడు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. అతడు ప్రస్తుతం 718 రేటింగ్స్‌తో 12వ స్థానానికి చేరుకున్నాడు. కాగా, సిరీజ్ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ పొజిషన్ కావడం విశేషం. కాగా, బ్యాటింగ్





విభాగంలో ఇంగ్లాండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్ టాప్‌లో ఉన్నాడు. ఆ తర్వాత పొజిషన్‌లో కూడా ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ కొనసాగుతున్నాడు. టీమ్ఇండియా బ్యాటర్ యశస్వీ జైస్వాల్ తాజా ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు దిగజారాడు. ప్రస్తుతం అతడు 7వ (779 రేటింగ్స్) స్థానంలో ఉండగా, రిషభ్ పంత్ (761 రేటింగ్స్) ఎనిమిదో ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. టీమ్ఇండియా టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం 722 రేటింగ్స్‌తో 13వ స్థానంలో ఉన్నాడు. ఇక బౌలింగ్ విభాగంలో టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా టాప్‌లోనే కొనసాగుతున్నాడు. అతడు 885 రేటింగ్స్?తో అగ్రస్థానంలో ఉండగా, కగిసొ రబాడ 851 రేటింగ్స్‌తో రెండో ప్లేస్‌లో ఉన్నాడు. టీమ్ఇండియా నుంచి టాప్ 10 లో బుమ్రా తప్పా ఇంకో బౌలర్ లేడు. టాప్ 20లో బుమ్రా సహా సిరాజ్ (12), రవీంద్ర జడేజా (669 రేటింగ్స్) 17వ స్థానంలో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజానే టాప్‌లో కొనసాగుతున్నాడు. జడ్డూ 430 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. బంగ్లాదేశ్ ప్లేయర్ మెహెదీ హసన్ మిరాజ్ 305 రేటింగ్స్‌తో రెండో ప్లేస్‌లో ఉన్నాడు. స్పిన్నర్ వాషింగ్టర్ సుందర్ మాత్రం నాలుగు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. అతడు 205 రేటింగ్స్‌తో ప్రస్తుతం 11వ స్థానంలో కొనసాగుతున్నాడు. సుందర్ తప్పా ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు లేవు.

# నా దేశం కోసం ఆడటం నాకు చాలా గర్వంగా ఉంది

## నేను జట్టు కోసం ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేస్తా
## టీమిండియా క్రికెటర్ సంజు శాంసన్ వెల్లడి



భారత స్టార్ వికెట్ కీపర్-బ్యాట్స్ మాన్ సంజు సామ్సన్ టీ20 ఫార్మాట్‌లో ఓపెనింగ్ బ్యాట్స్ మాన్ గా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. మరీ ముఖ్యంగా ఐపీఎల్ వంటి మ్యాచ్‌లలో అతడి పేరు మారుమోగిపోయింది. అతడు టీ20 ఫార్మాట్‌లో నిలకడైన ఓపెనర్‌గా ఆడుతూ పరుగులు సాధించాడు. అయినప్పటికీ ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అతని బ్యాటింగ్ ఆర్డర్‌ను ఛేంజ్ చేశారు. దీంతో ఇటీవల జరిగిన ఆసియా కప్ 2025 లో సామ్సన్ 5వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. ఇప్పుడు సంజు తన బ్యాటింగ్ ఆర్డర్ గురించి ఆశ్చర్యకరమైన ప్రకటన చేశాడు. అతడి ప్రకటన అందరినీ షాక్ కు గురిచేసింది. భారత్ త్వరలో ఆస్ట్రేలియాతో వండే, టీ20 సిరీస్‌లు ఆడబోతుంది. ఇందులో భాగంగా ఓపెనర్ శుభ్‌మాన్ గిల్ టీ20 జట్టులోకి తిరిగి రావడంతో.. సంజు సామ్సన్ బ్యాటింగ్ స్థానాన్ని మార్చారు. మరోవైపు అభిషేక్ శర్మ స్థానం ఇప్పటికే ఖాయంగా అనిపించింది. ఇక ఇటీవల ఆసియా కప్ 2025 సమయంలో సంజు 5వ స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఈ సందర్భంగా సంజు తాజాగా సీట్ అవార్డుల కార్యక్రమంలో తన బ్యాటింగ్ ఆర్డర్ గురించి మాట్లాడాడు. సామ్సన్ ఇలా అన్నాడు.. "నా దేశం కోసం ఆడటం నాకు చాలా గర్వంగా ఉంది. వారు నన్ను 9వ స్థానంలో బ్యాటింగ్ చేయమని అడిగినా నేను జట్టు కోసం అలా చేస్తాను." అని చెప్పుకొచ్చాడు. దీంతో అతడి ప్రకటన అందరినీ షాక్‌కు గురి చేసింది. ఇంకా అతడు మాట్లాడుతూ.. రోహిత్ శర్మకు కృతజ్ఞతలు తెలిపాడు. సంజు సామ్సన్‌తో పాటు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, కొత్త వన్డే వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కూడా అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. 2024 ప్రపంచ కప్ విజయం గురించి అడిగినప్పుడు సంజు మాట్లాడుతూ.. "విజయానికి ఫార్ములాను కనుగొనడానికి 16 సంవత్సరాలు పట్టింది. రోహిత్ భాయ్ కి ధన్యవాదాలు." అని తెలిపాడు. ఇదిలా ఉంటే ఆసియా కప్ 2025లో సంజు సామ్సన్ కీలకమైన ఇన్నింగ్స్ ఆడాడు. కష్ట సమయాల్లో మరీ ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్లో తిలక్ వర్మకు మంచి భాగస్వామ్యాన్ని ఇచ్చాడు. సంజు ఇప్పుడు ఆస్ట్రేలియాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆడబోతున్నాడు. వెస్టిండీస్, బార్బడోస్ వేదికగా 2024 టీ20 వరల్డ్?కప్ ఫైనల్?లో సౌతాఫ్రికాపై భారత చిరస్మరణీయ విజయం సాధించి ఛాంపియన్?గా నిలిచిన ఆ సందర్భాన్ని టీమ్ఇండియా ప్రతీ అభిమాని గుర్తుపెట్టుకుంటాడు. ఆ టోర్నీలో రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్ఇండియా ఒక్క ఓటమి లేకుండా ఛాంపియన్?గా నిలిచింది. ఈ క్రమంలో శాంసన్ అప్పటి కెప్టెన్ రోహిత్?పై ప్రశంసలు కురిపించాడు. అతడు జట్టును నడిపించిన విధానం అద్భుతంగా ఉందని కొనియాయాడు. అతడి గేమ్ అప్రోచింగ్, ప్లేయర్లపై ఉంచుకున్న నమ్మకమే జట్టును ఏకం చేశాయని అన్నాడు. "సక్సెస్ ఫార్ములా తెలుసుకోవడానికి 16 ఏళ్లు పట్టింది. ఈ క్రెడిట్ రోహిత్ భాయ్?దే. థాంక్స్ రోహిత్ భాయ్" అని వరల్డ్?కప్ విజయాన్ని ఉద్దేశించి హిట్?మ్యాన్?పై శాంసన్ ప్రశంసలు కురిపించాడు. దీంతో అక్కడున్న వాళ్ల చప్పట్లతో ఆడిటోరియం మార్మోగిపోయింది. 2007లో టీ20 వరల్డ్?కప్? విజేతగా నిలిచిన టీమ్ఇండియా ఆ తర్వాత పలుమార్లు సెమీ ఫైనల్, ఫైనల్ వరకు వచ్చినా టైటిల్ నెగ్గలేకపోయింది. గతేడాది రోహిత్ కెప్టెన్సీలో సమష్టిగా రాణించిన జట్టు విశ్వవిజేతగా నిలిచింది. టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహించడం జీవితంలో వచ్చిన గొప్ప అవకాశం అని శాంసన్ అన్నాడు. భారత్ జెర్సీ ధరించిన ప్రతిసారీ గర్వంగా ఫీల్ అవుతానని చెప్పాడు. అలాగే అంతర్జాతీయ క్రికెట్?లో అరంగేట్రం చేసి పదేళ్లు అవుతున్నా, 40 మ్యాచ్?ల్లోనే ఆడానంటూ సరదాగా మాట్లాడాడు. "ఇంటర్నేషనల్ క్రికెట్?లో రీసెంట్?గా 10ఏళ్లు పూర్తి చేసుకున్నా. కానీ 40 మ్యాచ్?ల్లోనే ఆడాను కావొచ్చు. అయితే ఈ నెంబర్లు ముఖ్యం కాదు. కానీ సవాళ్లను అధిగమించి ఇప్పుడు ఈ స్థాయికి వచ్చినందుకు గర్వపడుతున్నా" అని శాంసన్ పేర్కొన్నాడు.

# 2027 వరల్డ్ కప్ ఆడటమే నా లక్ష్యం


## హిట్ మ్యాన్ రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు



ఆస్ట్రేలియా వన్డే సీరీస్ కు ఫిట్ నెస్ నిరూపించుకున్నాడు రోహిత్ శర్మ. కఠినమైన టెస్ట్ ను పాస్ అయ్యాడు. దానికి ముందు కూడా సీనియర్ క్రికెటర్లు ఇద్దరూ భారత జట్టులో ఉంటారా లేదా అనుమానాలు చెలరేగాయి. అయితే ఏ సందర్భంలోనూ రోహిత్ శర్మ స్పందించాలేదు. ఆస్ట్రేలియా టూర్ కు వన్డే జట్టును ప్రకటించిన తర్వాత కూడా హిట్ మ్యాన్ ఏమీ మాట్లాడలేదు. కానీ నిన్న జరిగిన సియట్ అవార్డు ల ఫంక్షన్ లో రోహిత్ శర్మ మొట్టమొదటి సారిగా ఈ విషయంపై స్పందించాడు. తనకు అన్నింటి కంటే క్రికెట్ ఆడడం ముఖ్యమని చెప్పాడు. వచ్చే వన్డే వరల్డ్ కప్ వరకు జట్టులో కొనసాగడమే లక్ష్యమని మరోసారి గట్టిగా తెలిపాడు. సీనియర్ క్రికెటర్ గా జట్టుతో కలిపి మంచి ఫలితాలను అందించడంపైనే దబుష్టి పెడతానని అన్నాడు. ఆస్ట్రేలియా జట్టుతో ఢీకొనడాన్ని తానెప్పుడూ ఆస్వాదిస్తానని రోహిత్ చెప్పుకొచ్చాడు. ఆ జట్టుతో క్రికెట్ ఆడడం సవాల్ తో కూడుకున్నది..అక్కడ ప్రజలు కూడా ఆటను ఇష్టపడతారు. టీమ్ ఇండియా, ఆస్ట్రేలియాల మ్యాచ్ జరుగుతుందంటే...అది వేరే లెవల్ ఉంటుంది ఎప్పుడూ. కాబట్టి తమ జట్టు ఏం చేయాలో, తాను ఎలా ఆడాలో ప్రణాళికలు వేసుకుంటున్నానని రోహిత్ చెప్పాడు. కెప్టెన్సీ అనేది తనకు అంత ఇంపార్టెంట్ కాదని ఇండైరెక్ట్ గా తెలిపాడు. టెస్ట్, టీ20 లకు గుడ్ బై చెప్పినా వన్డేల్లో కొనసాగి..తదుపరి వరల్డ్ కప్ ను కొట్టడమే లక్ష్యమని మరోసారి చాలా బలంగా తెలిపాడు హిట్ మ్యాన్.మరోవైపు రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తొలగించడంపై బీసీసీఐ కూడా క్లారిటీ ఇచ్చింది. అన్ని ఫార్మాట్లలోనూ ఒకడే కెప్టెన్ ఉండాలన్న ఉద్దేశంతోనే శుభ్ మన్ గిల్ ను కెప్టెన్ గా ఉంచామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నారు. దాంతో పాటూ 2027 వరల్డ్ కప్ ను దృష్టిలో ఉంచుకుని కూడా తాము గిల్ కు అవకాశం ఇచ్చామని చెప్పారు. ఇప్పటి నుంచి అతను కెప్టెన్సీ చేస్తే అప్పటికీ అనుభవం వస్తుందని తెలిపారు. వరల్డ్ కప్ ఆడడానికి రెండు ఏళ్ళు ఉన్నట్టు కనిపిస్తున్నా మధ్యలో భారత జట్టు వన్డేలు ఆడేది ఎక్కువగా లేదని అగార్కర్ స్పష్టం చేశారు. మూడు ఫార్మాట్లకు ముగ్గురు వేర్వేరు కెప్టెన్లను కలిగి ఉంటే చాలా కష్టం. సెలెక్టర్ల పరంగానే కాదు.. కోచ్‌కి కూడా ఇదికష్టమేనని వివరించారు. ముగ్గురు వేర్వేరు వ్యక్తులతో ప్రణాళికలు వేయడం ఎప్పుడూ సులభం కాదని అజిత్ అగార్కర్ తెలిపారు.

# కమిన్స్, హెడ్ రూ.58 కోట్ల డీల్ తిరస్కరణ





ప్రపంచ క్రికెట్‌లో దేశాల సరిహద్దులు చెరిపేసి అందరినీ ఒకతాటిపైకి తీసుకువచ్చిన టోర్నీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్). క్రికెట్ ప్రియులను ఉర్రూతలూగించే ఐపీఎల్‌లో పూటకో పరిణామం చోటుచేసుకుంటోంది. ఏడాదికోసారి జరిగే ఐపీఎల్‌లో మార్పులు చేర్పులు జరుగుతుంటాయి. తాజాగా ఆస్ట్రేలియా దిగ్గజాలు ట్రావిస్ హెడ్, పాట్ కమిన్స్‌కు ఓ భారీ డీల్ వచ్చిందని తెలుస్తోంది. అయితే ఆ డీల్‌ను నిర్ద్వందంగా తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. ఐపీఎల్‌లో ఓ ఫ్రాంచైజీ ఆ డీల్ ఇచ్చినట్లు.. అయితే ఆ డీల్‌ను తిరస్కరించడం సంచలనం రేపుతోంది. ఆ డీల్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్య మారన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకుందాం. ఆస్ట్రేలియా స్టార్ ఆటగాళ్లు ట్రావిస్ హెడ్, పాట్ కమిన్స్ దేశానికి అద్భుతంగా సేవలు అందిస్తూనే అక్కడి లీగ్ మ్యాచ్‌లు కూడా ఆడుతున్నారు. వాటితోపాటు మన దేశానికి చెందిన ఐపీఎల్‌లో చెరగని ముద్ర వేస్తున్నారు. ప్రస్తుతం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వారిద్దరూ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కమిన్స్ కెప్టెన్‌గా ట్రావిస్ హెడ్ బ్యాట్స్‌మన్‌గా అదరగొడుతున్నారు. అయితే పూర్తిగా తమకే సమయం కేటాయించాలని.. ఇతర లీగ్ మ్యాచ్‌లు ఆడరాదని ఐపీఎల్‌కు చెందిన ఓ ఫ్రాంచైజ్ డీల్ ఇచ్చిందని వార్తలు వస్తున్నాయి. ప్రపంచకప్, టెస్టు చాంపియన్ విజేతలు హెడ్, కమిన్స్ అమెరికాకు చెందిన లీగ్ క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. హెడ్ వాషింగ్టన్ ఫ్రీడమ్, కమిన్స్ సాన్‌ఫ్రాన్సిస్కో యూనికర్న్ తరఫున ఆడుతున్నాడు. దీంతోపాటు ఆస్ట్రేలియాకు చెందిన బిగ్ బాష్ లీగ్‌కు వారిద్దరూ ఆడుతున్నారు. వీటితోపాటు ఐపీఎల్‌కు కూడా హెడ్, కమిన్స్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎస్ఏ20, ఐఎల్‌టీ20 వంటి లీగ్‌లలో ఆడుతున్నారు. అటు ఆస్ట్రేలియా దేశానికి ఆడుతూ.. ఇటు ఇతర లీగ్ మ్యాచ్‌లు ఆడుతుండడంతో హెడ్, కమిన్స్‌పై ఒత్తిడి పెరుగుతోందని ఐపీఎల్‌లోని ఓ ఫ్రాంచైజీ భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వారిద్దరినీ ఇతర లీగ్ మ్యాచ్‌ల నుంచి వైదొలగాలని కోరుతూ ఓ డీల్ ఇచ్చినట్లు సమాచారం. హెడ్, కమిన్స్‌కు ఐపీఎల్‌లోని ఓ ఫ్రాంచైజీ రూ.58 కోట్ల భారీ డీల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఇతర లీగ్‌ల నుంచి వైదొలిగి పూర్తిగా తమ సొంత దేశం ఆస్ట్రేలియాతోపాటు ఐపీఎల్‌కు సమయం కేటాయించాలని ప్రతిపాదించినట్లు చర్చ జరుగుతోంది. అయితే ఈ డీల్‌ను ట్రావిస్ హెడ్, పాట్ కమిన్స్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఇంత భారీ డీల్‌ను తిరస్కరించి వారు అన్నింట్లో ఆడేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అయితే ఆ డీల్ ఇచ్చింది కావ్య మారన్ అని తెలుస్తోంది. కావ్య మారన్‌కే వారు షాకిచినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఐపీఎల్‌లో ట్రోఫీ గెలవడానికి సదరు ఐపీఎల్ ఫ్రాంచైజీ వారిద్దరికీ ఆ డీల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. మరి వాస్తవమేమిటనేది ఎప్పుడో అప్పుడో బయటకు రానుంది.


# అమన్ సెహ్రావత్‌పై సస్పెన్షన్ వేటు



పారిస్ ఒలింపిక్స్ మెడల్ విన్నర్, భారత స్టార్ అథ్లెట్? అమన్ సెహ్రావత్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. అతడిపై ఏడాది సస్పెన్షన్ వేటు పడింది. భారత రెజ్లింగ్ సమాఖ్య అతడిపై ఒక సంవత్సరం పాటు సస్పెండ్ చేసింది. ఈ మేరకు అధ్యక్షుడు సంజయ్ సింగ్ ఈ నిర్ణయాన్ని ధ్రువీకరించారు. అయితే అమన్ సెహ్రావత్ బరువు నియంత్రణ, ఫిట్‌నెస్ అంశాల్లో సమాఖ్య నిబంధనలు ఉల్లఘించినట్లు తెలుస్తోంది. అతడు సెప్టెంబర్‌లో క్రొయేషియాలోని జాగ్రెబ్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనే 57 కిలోల విభాగం నుంచి అనర్హుడిగా ప్రకటించారు. అనంతరం సెహ్రావత్-సహా అతని కోచింగ్ సిబ్బందికి సమాఖ్య హెచ్చరిక జారీ చేసింది. నిబంధనల ఉల్లంఘించినందుకు వివరణ కోరింది. అయితే అమన్ ఇచ్చిన వివరణ పట్ల సమాఖ్య సంతృప్తి చెందలేదు. దీంతో అతడిపై వేటు పడింది.అమన్ నిషేధాన్ని రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంజయ్ సింగ్ ధ్రువీకరించారు. "బరువు సంబంధిత నియమాలను ఉల్లంఘించినందుకు ఒలింపిక్ పతక విజేత అమన్ సెహ్రావత్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు భారత రెజ్లింగ్ సమాఖ్య ప్రకటించింది. సెప్టెంబర్ 23 నుంచే ఈ సస్పెన్షన్ అమలులోకి వచ్చింది. అతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎటువంటి రెజ్లింగ్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిషేధించాం" అని సంజయ్ అన్నారు. సెప్టెంబర్ 14న జరగాల్సిన మ్యాచ్‌కు 18 రోజుల ముందు సెహ్రావత్ క్రొయేషియాలోని పోరెక్‌లో జరిగిన సన్నాహక శిబిరంలో చేరాడట. తగినం సమయం ఉన్నప్పటికీ అతడు నిబంధనల ప్రకారం బరువు, ఫిట్‌నెస్‌ను కంట్రోల్?లో ఉంచుకోలేలేదని తెలిసింది. సెహ్రావత్‌పై నిషేధం సెప్టెంబర్ 23నే అమల్లోకి వచ్చింది. ఇది సెప్టెంబర్ 2026 వరకు కొనసాగుతుంది. ఈ ఒక సంవత్సరం నిషేధం సెహ్రావత్ కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా 2026 ఆసియా క్రీడల కోసం ప్రాక్టీస్ చేసే అవకాశాన్ని కోల్పోతాడు. 2026 సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 03 వరకు రెజ్లింగ్ పోటీలు ఉండనున్నాయి. %ఔఖీ×% సస్పెన్షన్ ఎత్తివేయకుంటే, అతడికి ఆసియా క్రీడల్లో పాల్గొనడం దాదాపు కష్టమే! గతేడాది పారిస్ ఒలిపింక్స్ పోటీల సందర్భంగా కూడా అమన్ పోటీకి ముందు ఉండాల్సిన దానికంటే ఎక్కువ బరువు ఉన్నాడు. కాంస్యం పోరులో 57కేజీల ఫ్రీస్టైల్ ఈవెంట్?కు ముందు అమన్ 61.5 కేజీలు ఉన్నాడు. అమన్ బరువుపై శ్రద్ధ తీసుకున్నాడు. పోటీ సమయానికి 57 కేజీలకు తగ్గడానికి కఠినంగా శ్రమించాడు. కేవలం 10 గంటల వ్యవధిలోనే ఏకంగా 4.6 కేజీలు తగ్గాడు. ఇందు కోసం అతడి కోచింగ్ బృందం తీవ్రంగా కష్టపడింది.ఏడాది కాలంలోనే రెజ్లర్లకు క్రమశిక్షణా ఉల్లంఘన జరగడం ఇది మూడోసారి. గతేడాది పారిస్ ఒలిపింక్స్? నుంచి ఫిట్‌నెస్ కారణాల వల్ల వినేశ్ ఫొగాట్?పై, 2025 ప్రపంచ అండర్- 20 ఛాంపియన్‌షిప్ నుంచి నేహా సంగ్వాన్?పై అనర్హత వేటు పడ్డాయి. ఈ రెండు సంఘటనలపై తీవ్ర వివాదం జరిగింది.

09-10-25 Samayam_Layout 1 10/9/2025 5:08 AM Page 12






# ఓటిటిలోకి వార్-2 ఎంటర్

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ నటుడు ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం వార్. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటించగా.. అనిల్ కపూర్, అశుతోష్ రాణా, అలియాభట్, బాబీ దేవోల్, శర్వారీ వాఘ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు అయాన్

ముఖర్జీ దర్శకత్వం వహించగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించాడు. ఈ చిత్రం ఇండెపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం అక్టోబర్ 9 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇండియన్ రా ఏజెన్సీలో ప్రముఖుడైన ఏజెంట్ కబీర్(హృతిక్) కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేస్తుంటాడు. ఇదిలావుంటే.. చైనా, రష్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలన్నీ ఒక కోటరీగా మారి, 'కలి' పేరుతో ఇండియా పతానానికి ఎలాన్ చేస్తాయి. ఈ మిషిన్‌ని కబీర్‌కు అప్పజెబుతాయి. కబీర్‌ను అడ్డుకునేందుకు విక్రమ్ చలపతి (జూనియర్ ఎన్టీఆర్) రంగంలోకి దిగుతాడు. అసలు కబీర్‌కీ, విక్రమ్‌కు మధ్య ఉన్న బంధం ఏంటి? 'కలి' వల్ల భారత ప్రధానికి పొంచివున్న ముప్పును వీరిద్దరూ ఎలా ఆపారు? ఈ మిషన్‌లో వింగ్ కమాండర్ కావ్య లూత్ర(కియారా అద్వానీ) పాత్ర ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.



# మళ్లీ అవకాశాలు పట్టుకుంటున్న పూజా

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది పూజాహెగ్డే. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో టాప్ స్టార్లతో కలిసి నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ పొడుగు కాళ్ల సుందరికి తెలుగులో హిట్ పడక చాలా కాలమే అవుతుంది. తెలుగులో కూడా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. ఈ లీడింగ్ హీరో రవి నెలకుడిటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో జెట్ స్పీడ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాతో లాంగ్ గ్యాప్ తర్వాత పూజా హెగ్డే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా కథనాల ప్రకారం ఈ సినిమా కోసం పూజా హెగ్డే ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుందని టాక్. అయితే రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేస్తున్న కారణంగా పూజాహెగ్డే తెలుగు సినిమాలకు దూరమైందని కొన్ని రోజుల క్రితం వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ దుల్కర్ సల్మాన్ టీంకు ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పూజా హెగ్డేను తమ టీంలోకి తీసుకుందట. ఇక ఈ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ తెలుగులో దుల్కర్ సల్మాన్ సినిమాతో మళ్లీ ఫాంలోకి రావాలని చూస్తున్నట్టు అర్థమవుతుంది. ఇటీవలే రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది పూజా హెగ్డే. ఈ పాటలో అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కూలీ సాంగ్ భారీ హిట్ అయింది. ఇక దుల్కర్ సల్మాన్ సినిమా బ్లాక్ బస్టర్ అయితే పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని చెప్పొచ్చు.



# మాస్ జాతర నుంచి మరో పాట

## ఓటేటోలే పాటపై విమర్శలను తిప్పికొట్టిన రవితేజ

రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర'. అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో 'హుడియో హుడియో' పాటను విడుదల చేయనున్నారు. చిట్టి చిలకా.. చిన్న మొలకా..అంటూ సాగే లిరిక్స్‌ను దేవ్ రాయగా అబ్దుల్ వహాబ్, భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. ఇటీవల ఇందులోని 'ఓలే ఓలే' లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ పాట లిరిక్స్‌లో అసభ్య పదాలు ఉన్నాయిని విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రవితేజ, దర్శకుడు ఈ విమర్శలపై స్పందించారు. కొన్నిటిపై బోల్డ్ మూవీలు అనే ముద్ర వేస్తారు. అలాంటి వాటితో ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ, వారికి నా సినిమాతో మాత్రమే సమస్య వచ్చింది. మా గ్రామాల్లో స్థానికంగా జరిగే ఉత్సవాల్లో కొంతమంది చిన్న చిన్న కథలను పాటలుగా చెబుతుంటారు. వాళ్లు తిట్టుకున్నట్లు అనిపిస్తుంది కానీ, వాస్తవానికి వాళ్లు చాలా ప్రేమగా మాట్లాడుకుంటారని దర్శకుడు భాను అన్నారు. విమర్శలు చేసేవారు కేవలం పాటలోని కొన్ని పదాలను మాత్రమే చూస్తున్నారు. తర్వాత వచ్చే సరదా సంభాషణలను చూడడం లేదు. సినిమా చూశాక ఈ పాట వెనక ఉన్న అసలు కథ మీకు అర్థమవుతుంది. ప్రేక్షకులకు అందరికీ ఈ పాట నచ్చుతుంది. అయినా ఇప్పుడు ఇంగ్లిష్‌లో కొన్ని పదాలు సాధారణం అయిపోయాయి. వాటిని తెలుగులో చెప్పినప్పుడే కొందరికి సమస్య వస్తుందని రవితేజ చెప్పారు. ఇక ఈ పాట సినిమాలో సన్నివేశానికి సరిగ్గా సరిపోతుందని శ్రీలీల అన్నారు.

# లోక సినిమాతో హిట్ సాధించిన కళ్యాణి

లోక సినిమాతో రూటు మార్చేసింది కళ్యాణి ప్రియదర్శన్. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్‌గా నిలువడమే కాదు.. నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. అత్యధిక గ్రాస్ సాధించిన సౌతిండియన్ ఫీ మేల్ సెంట్రిక్ మూవీగా నిలిచింది. మాలీవుడ్ లో గత రికార్డులు బీట్ చేసి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. కళ్యాణి ప్రియదర్శన్ మళ్లీ గ్లామరస్ అవతార్‌లోకి మారిపోయింది. ఎవరూ ఊహించని విధంగా సూపర్ గ్లామర్ రోల్‌లో దర్శనిమిచ్చింది కళ్యాణి ప్రియదర్శన్. ఈ భామ కమర్షియల్ సినిమా హీరోయిన్‌గా ట్రాన్స్‌ఫార్మేషన్ అయిన తీరుకు షాక్ అవుతున్న ఫాలోవర్లు, నెటిజన్లు.. ఈ సాంగ్‌లో వేసిన స్టెప్పులకు ఫిదా అవుతున్నారు.గ్లామరస్ పాత్ర గురించి కళ్యాణి ప్రియదర్శన్ మాట్లాడుతూ.. ఓ యాక్టర్‌గా నేను ఇదివరకెన్నడూ చేయని పాత్రలను చేయాలని నాకు నేను చాలెంజింగ్‌గా తీసుకుంటా. ఈ పాటలో అలాంటి కొన్ని మూమెంట్స్ ఉన్నాయి. నా డైరెక్టర్ భువనేశ్ ఈ విషయం గురించి నాకు చెప్పినప్పుడు.. అతడు ఉ౹నితి౹ కథకు చాలా ముఖ్యమైన అందమైన కమర్షియల్ మ్యూజికల్ పీస్‌ను అద్భుతంగా ఎలా తీశాడోనని అనిపించింది. దీనివెనుకున్న కారణాలు చాలా శక్తివంతమైనవి. ఏదైనా కొత్తగా చేయాలని.. చాలా బాగా కష్టపడటం జరిగింది. మీరంతా ఈ పాటను ఇష్టపడతారని ఆశిస్తున్నానని చెప్పుకొచ్చింది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**